కొత్తమాట

స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

అందరికీ చేమోడుపులు. ఒక నుడిని బాగా ఎదిగిన నుడి అని చెప్పడానికి ఆనవాలు ఏమిటి అంటే, పెరనుడి నుండి వచ్చిన ఏ మాటకైనా తన కుదురులతోనే కొత్తమాట పుట్టింపుకు వీలు కలిగించగలగడం. అటువంటి నుడులు, అంటే బాగా ఎదిగిన నుడులు, వేళ్లమీద లెక్కించగలిగినన్నే ఉన్నాయి. మన బారతనాడులో వేలేండ్ల కిందటనే పాళీ, సంసుక్రుతం ఎదిగిన నుడులు అయినాయి. ఇటీవల తమిళం కూడా ఈ మట్టుకు చేరుకొనింది.

ఇట్ల తన కుదురులతోనే మాటలపుట్టింపుకు వీలుకలిగించే చేవ తెలుగుకు ఉందా అంటే లేదు లేనేలేదు అంటున్నారు తెలుగు తెలివరు(మేదావు)లు. ఉంది అనేది నా అందింత(ప్రతిపాదన). తెలుగులో ఇదివరకు ఎన్నడూ కొత్తమాటలు రాలేదా, ఎవ్వరూ కొత్త మాటల్ని తేలేదా అంటే ఆ పని జరిగిందనే చెప్పాలి. ఎట్లా జరిగింది? అయిదు తీరులుగా జరిగింది.

1. ఉన్నదున్నట్లుగా పెరనుడి మాటలను తెచ్చుకొని వాడడం. స్వేచ్ఛ, చరిత్ర, బస్, కార్ వంటివి.
2. పెరనుడి మాటలకు 'డు, ము, వు, లు' చేర్చి వాడడం. అధ్యక్షుడు, వికలాంగుడు, శౌచాలయం, ముద్రణాలయం వంటివి.
3. పెరనుడి మాటలను తెలుగు చప్పుడుకు వీలుగా మార్చుకొని వాడడం. సంద్రం, కబురు, ఆసుపత్రి, బస్సు, కారు వంటివి.
4. 'అచ్చతెలుగు' పేరుతో చేంతాడంత మాటల్ని పుట్టించడం. అంచయేనుగుమావంతు, చదువుల ముదుకడు, గడుసుకైదువ జోదు, మినుకుటూర్పులవాడు, ఏనుగుతోలుదాల్పు, కప్పుగుత్తుకవాడు వంటివి. పై నాలుగు తెరగులూ చదువునేర్చినవారూ తెలివరులూ నుడివరు(బాషావేత్త)లూ చేసిన చేస్తున్న పని. మొదటి రెండుతీరులూ అయితే నన్నయనుండి లేదా ఇంకా ముందునుండి, ఇప్పటి 'ఈనాడు' వరకూ సాగుతూ వస్తున్నాయి.
5. చదువుతో పొంతులేనివారు, పల్లెటూరి పాటరు (శ్రామికు)లు, అడుగుబడుకు బతుకులు పుట్టించే మాటలు. రామములక(టొమేటో), గబ్బుచమురు(కిరోసిన్), వానగూడ(రెయిన్ కోట్), పొద్దుమాను(గడియార స్తంబం), రెక్కమాను(రైల్వేసిగ్నల్ పోల్), చిచ్చుగోలు(గ్యాస్టవ్ లైటర్), చలిచట్ట(స్వెట్టర్) వంటివి. పైవాటికంటే ఈ తీరు మాటలే గొప్పవి. ఇవే అప్పటపు తెలుగుమాటలు. తెలివరుల కంటే పాటరులే మేలు అనిపిస్తుంది కదా. అయితే తమ కంటిముందుకు వచ్చిన కొత్త ఉరువులకు పేర్లు పెట్టగలరు కానీ ఆనిమి(సాంకేతిక) మాటలను పుట్టించలేరు, ఎసిది(శాస్త్ర) నెన్నొడి (పరిబాష)ని పొందించలేరు పాటరులు.

'ఆనిమిమాట' అనడానికి దానికి రెండు ఆలుడు(లక్షణా)లు ఉండాలని నుడివరులు చెపుతుంటారు. 1) విడమరచి చెప్పినట్లుగా కాకుండా చిట్టిపొట్టి మాటగా ఉండాలి 2) తననుండి మరికొన్ని మాటల పుట్టుకకు తావునివ్వాలి. ఈ రెండు ఆలుడులు తెలుగుకు లేవు, కాబట్టి తెలుగులో ఆనిమి మాటలను పొందించలేము అంటారు నుడివరులు. ఇది పెద్ద తప్పుడుమాట. అక్కరలేమితో పట్టనితనమన్నా అయుండాలి, వెతకలేక సోమరితనమన్నా అయుండాలి, తెలుగును తొక్కేయాలనే కుత్రతలపన్నా అయుండాలి, అంతేకాని ఇది వాళ్ల తెలివితక్కువతనం మట్టుకు కానేకాదు.

తెలుగులో కుదురులూ చేర్పులూ కలసిన మాటలు చాలా చాలా ఉన్నాయి. కుదురుల నుండి చేర్పులను విడదీయాలి. ఎటువంటి కుదురుకు ఎటువంటి చేర్పు కలిస్తే కొత్తమాట పుడుతున్నదో చూడాలి. ఆ తీరులో కొత్తమాటలను పుట్టించాలి. కొన్ని పనిపలుకు(క్రియావాచకా)లకు చేర్పులను చేర్చితే పేరుపలుకులు(నామవాచకాలు) పుడుతాయి : కోరు+ఇక=కోరిక. కొన్ని పేరుపలుకులకు చేర్పులను చేర్చితే కొత్త పేరుపలుకులు పుడుతాయి : ఎరుక+ఉవ=ఎరుకువ. కొన్ని పేరుపలుకులకు చేర్పులను చేర్చితే కొత్త పనిపలుకులు పుడుతాయి : పుప్పొడి(pollen) +ఇల్లు = పుప్పొడిల్లు(pollenise); పుప్పొడి+ఇంచు= పుప్పొడించు(pollinate). ఈ పుప్పొడించు అనే పనిపలుకును మరలా పేరుపలుకుగా మార్చవచ్చు : పుప్పొడించు = పుప్పొడింత(pollination).

తెలుగులో మునుచేర్పులను వెనుచేర్పులను వెతకడం మొదలిడితే ఇప్పటికే నాకు నూటికి పైగా కనబడినాయి. నేను నుడివరిని కాను, నుడెసిదిని(బాషాశాస్త్రాన్ని) చదవలేదు. నుడివరులు నడుము కట్టుకొని వెతికితే ఇంకా ఎన్నో దొరుకుతాయి.

నాది లేదా మనది అనే చెడ్డనుగు(దురబిమానం)తో చెప్పడం లేదు. నేనెరిగిన నాలుగయిదు నుడులలో ఎంతో చేవ కలిగినది తెలుగు. తెలుగులో ఎసిదానిమి(శాస్త్రసాంకేతిక) మాటలను పుట్టించడం చాలా తేలిక. అవి కూడా చిట్టి పొట్టిగా అలతి అలతిగా పలకడానికి తేలికగా ఉంటాయి. పెరమాటలతో కాకుండా తెలుగుమాటలతో పిల్లలకు చదువులు చెపితే పిల్లలూ ఎదుగుతారు తెలుగూ ఎదుగుతుంది. 'డు, ము, వు, లు, ని, ను, కి, కు, వల్ల, నుండి, ఇంచు/ఇంచి, కోసం, తో, కంటే, చేసి....' ఇటువంటి కూర్పులనూ చేర్పులనూ మట్టుకే మిగిలించి, మిగిలినదంతా పెరమాటలతో నింపేసి, తెలుగు ఇక్కువం(మాద్యమం)లో చదువులు సాగాలని చాటడం సరికాదు. మన్నించండి, ఎవరినీ నొప్పించాలని ఈమాటను అనలేదు, తెలివరులూ నుడివరులూ ఇకనైనా తెలుగును తలకెత్తుకొంటారనే ఆబతో అన్నాను.

ఈ నోయి(గ్రందం)ని రాయాలనే కోరిక పదేళ్లనాటిది. చేర్పుల కోసం నా వెతుకులాట అప్పుడే మొదలయింది. నాలుగేళ్ల కిందటే

నలబై పొరట(పేజీ)లను రాసి, వేరే పనుల ఒత్తిడితో పక్కన పడేసినాను. మరలా ఇన్నేళ్లకు దుమ్ముదులిపినాను.

తెలుగు ఎంతో చేవకలిగిన నుడి. చేతనయిన నుడి. ఇంత గొప్ప నుడి ఒడమి(సంపద)ని పాతర వేసి పెట్టేసి, పొరుగిళ్ల దగ్గర అడుక్కొని తింటున్నాం. ఇకనైనా మన కలిమిని వెలికితీద్దాం.

1

"కాపటేళ లేసింది కాపుగువ్వ
కానలోకి పోయింది కాపుగువ్వ
కడుపు బరువు దించింది కాపుగువ్వ
కాళ్లు కడుక్కోనొచ్చింది కాపుగువ్వ

కుంపట్లో బొగ్గునెత్తి కాపుగువ్వ, పల్
కసబిసా తోమింది కాపుగువ్వ
కాడిమడక కట్టుకొని కాపుగువ్వ
కాన దున్నేకి కదిలింది కాపుగువ్వ "

మా పక్కింట్లో ఒక ముసలవ్వ ఉంది. కాపటేళకే (వేకువనే) లేచేస్తుంది. వక్కరోట్లో వక్కాకును పెట్టి టక్కుటిక్కుమని దంచతా పైపాటను అందుకొంటుంది. ఇక మనం కునకాలన్నా కునకలేము. ఏదో నాలుగు నుడుగులు అయితే పోనీలే అనుకోవచ్చు. కాపటేళ నుండి మాపటేళ వరకూ కాపుగువ్వ చేసే పనులన్నీ ఉంటాయి ఆ పాటలో. నారుచల్లడం నుండి పైరుకోత వరకూ వరిపంట కాపుదన మంతా ఉంటుంది అందులో. చేయగలిగింది ఏమీ లేదు మేలుకొని లేవడం తప్ప.

లేచి పడకను చుట్టిపెట్టి, నీళ్లర(బాత్‌రూం)లోకి వెళ్లినాను. మరుగుదొడ్డి మునకతొట్టీ(బాత్ టబ్) ఒకే అరలో ఉంటాయి మాయింట. కడుపుబరువుని దించినాను. చేగడుగు(హేండ్ వాష్)తో చేతుల్ని రుద్దినాను. పలుదుం(టూత్ బ్రష్) మీద పదడు(పేస్ట్)ను వేసుకొని పళ్లు తోముకొన్నాను. మూతిముక్కూ కడుక్కొన్నాను. తుండద(టవల్)తో తుడుచుకొన్నాను. కాసేపు పసలిక(వ్యాయామం) చేసినాను. మరికాసేపు సోదాకిక(వార్తాపత్రిక)ను తిరగేసినాను. ఆకలివేస్తుంటే నలిదిండి(టిఫిన్) చేసుకొందామని లేచినాను. కొద్దిగా నూక ఉంటే, ఉప్పిండి చేసుకొని తినినాను. కానీరు(కాఫీ) కాచుకొని తాగినాను. ఇవ్వేళ రాతపనేమీ లేదు. తోటపని కూడా లేదు. తోచక చిన్నయ్యవాళ్ల ఇంటితట్టుకు అడుగులు వేసినాను.

నన్ను చూసిన చిన్నయ్య, "రా అన్నయ్యా రా, నీకోసమే ఎదురుచూస్తున్నాం" అని రాకేర్చి(స్వాగతించి)నాడు నన్ను.

అప్పటికే అక్కడ నారాయణ, సెందిల్ కూడా కూర్చుని వున్నారు. ఏదో పెనగువ(చర్చ) గట్టిగా జరుగుతున్నట్లుంది వాళ్ల నడుమ.

''ఉసురువం(ప్రపంచం)లో ఏమూలనుండి కొంగొత్త ఆనిమిమాట(సాంకేతికపదం) వెలువడినా, దానికి ఈడైనమాటను అన్నినుడులలోనూ పుట్టించలేము. ఉసురువంలోని ఏడువేల పైచిలుకు నుడులలో కొంగొత్త ఆనిమిమాటల పొందికకు అనువు అయినవి సంసుక్రుతం, గ్రీకు, లాటిన్ వంటివి అయిదారుమట్టుకే ఉన్నాయి. ద్రావిడనుడులకు ఆ చేవ లేనేలేదు" అన్నాడు నారాయణ.

''ద్రావిడనుడులు అని అన్నిటినీ ఒకే గాటన కట్టద్దు. ఆనిమిమాటల పుట్టింపుకు మా తమిళ్ చాలా అనువయినది. మీకు తెలియదేమో, మేము మరెసిది(ఇంజినీరింగ్), విరుగెసిది(మెడిసన్)కి చెందిన ఆనిమిమాటలను అన్నిటినీ తమిళ్‌లో పుట్టించుకొన్నాం" అంటూ తగులుకొన్నాడు సెందిల్.

"నారాయణా, తెలుగంటే నీకు చిన్నచూపు. సంసుక్రుతం మట్టుకే గొప్పనుడి అని నీ అనిపింపు. అందుకనే ఇట్ల మాట్లాడుతున్నావు" అన్నాడు చిన్నయ్య.

"ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకు? నేను చెప్పింది నిక్కం. ఆనిమిమాటల్ని పుట్టించడంలో సంసుక్రుతానికి ఉన్న చేవలో ఒక్కవంతు కూడా తెలుగుకు లేదు" కుండబద్దలు కొట్టినట్లు అన్నాడు నారాయణ.

ఇక నేను కలిపించుకోక తప్పలేదు. "నువ్వు చెపుతున్నది తప్పు నారాయణా. సంసుక్రుతం ఒకప్పుడు మన బారతనాడులో పెన(అనుసందాన)నుడిగా ఉండేది. కాబట్టి రెండువేలేళ్ల నుండి వెయ్యేళ్ల కిందటివరకూ సంసుక్రుతంలోనే ఎసుదు(శాస్త్రా)లన్నీ వెలువడినాయి. ఆ తరిలోనే, ఆనిమిమాటలూ, వాటి పొందికకు కావలసిన పలు నుడిగంటు(నిగంటువు)లూ సంసుక్రుతంలో ఏర్పాటు అయినాయి. తెలుగులో ఆ పనిని ఇంతవరకూ మొదలు పెట్టలేదు. మొదలిడి చేసితే సంసుక్రుతం కంటే చిన్నమాటలతో తెలుగులో నెన్నొడి పుడుతుంది" అన్నాను.

"నువ్వు చెప్పేది నిక్కం అయితే, ఏదయినా ఒకమాటను పుట్టించి చూపించు. వెర్టిబ్రేట్ అనే ఇంగ్లీసు ఆనిమిమాటను, సంసుక్రుతం ఆనుగా తెలుగులో సకశేరుకం అనవచ్చు. దానికి ఎదురుమాట అకశేరుకం. వీటిని తెలుగుకుదురులతో ఎట్ల చెప్పగలం. వెన్నెముక కలవీ, వెన్నెముక లేనివీ అని విడమరపుగా చెప్పగలం కానీ ఆనిమిమాటలుగా చెప్పగలమా?" డీకొంటూ అడిగినాడు నారాయణ.

"బాగా చెప్పగలం. చెప్పాలన్న కోరిక కలగాలి ముందు. తెలుగులో ఒక విడిత(ప్రత్యేకత) ఉంది. కొన్ని మాటలకు ఉమ్మడిగా ఒక్కొక్క చేర్పు కనబడుతుంటుంది. ఇట్లాంటి ఒక చేర్పు 'ఏలు'. ఇది విడిగా నుడిగంటులలో కనబడదు. ఇదివరకు చెప్పినట్లు, తెలుగులో ఇటువంటి పనులను మనం ఇంకా మొదలిడలేదు కాబట్టి, నిండైన నుడిగంటులు వెలువడలేదు. కుందేలు, తాబేలు, తోడేలు, పొట్టేలు, గొడ్డేలు, ఆడేలు అనే పేరులలో ఉమ్మడిగా 'ఏలు' ఉంది. ఏలు అంటే 'జీవి' అనే తెల్లం(అర్థం) తెలుస్తున్నది కదా. ఈ ఏలును చేర్పుగా చేసి కొత్త ఆనిమిమాటలను పుట్టించవచ్చు. నువ్వు అడిగింది అకశేరుకం, సకశేరుకం అనే రెండు మాటలకే. అకశేరుకాల్లోని తొమ్మిది వగలకు పేర్లను పెట్టలేక ఊరుకొన్నారు మీ సంసుక్రుతంవాళ్లు. అవి గ్రీకు, లాటిను మాటలుగా అట్లాగే ఉన్నాయి

తెలుగు పొత్తాలలో. అన్నిటికీ తెలుగుపేర్లను పుట్టిద్దాం ఇప్పుడు" అంటూ మొదలు పెట్టినాను......

1.	వెన్ను+ఇడి+ఏలు= వెన్నిడేలు	అకశేరుకము	వెన్ను అనేది కుదురుమాట. ఆ మాటకు రెండు చేర్పులు చేరినాయి. 'ఇడి' అనే చేర్పుకు 'లేని' అని తెల్లము. 'పామిడి తురగపుపాదము'లో అన్నమయ్య పామిడిని వాడినాడు. పాము + ఇడి, అంటే 'పాములు లేకుండా' అని. వెన్నిడేలు అంటే వెన్నులేని ఏలు అని.
2.	తొలి+ఏలు = తొలేలు	ప్రోటోజోవా	ప్రోటో అంటే తొలి లేదా మొట్టమొదటి.
3.	తూటు+ఏలు = తూటేలు	పోరిఫెరా	తూట్లుతూట్లుగా ఉండేది.
4.	చదును+ఏలు = చదునేలు	ప్లాటి హెల్మెంతిస్	చదునుగా ఉండేది.
5.	పేలిక+ఏలు = పేలికేలు	నిమాటి హెల్మెంతిస్	పేలికలాగా సన్నగా పొడవుగా ఉండేది.
6.	బొజ్జ+ఏలు = బొజ్జేలు	సీలెంటిరేటా	బొజ్జను కలిగి ఉండేది.
7.	చుట్టు+ఏలు = చుట్టేలు	అనిలెడా	తాకితే చుట్టచుట్టుకొనేది.
8.	కీలు+ఏలు = కీలేలు	ఆర్థోపొడా	కీళ్లను కలిగి ఉండేది.
9.	జిగట+ఏలు = జిగటేలు	మొలస్కా	తాకితే జిగటగా ఉండేది.
10.	గరుకు+ఏలు = గరుకేలు	ఇకైనొడెర్మేటా	తాకితే గరుకుగా ఉండేది.
11.	వెన్ను+ఏలు = వెన్నేలు	సకశేరుకము	వెన్ను కలిగినది.
12.	నీరు+ఏలు = నీరేలు	జలచరము	నీటిలోనే ఉండేది.
13.	ఇరు+ఏలు = ఇరేలు	ఉబయచరము	నీటిలోనూ నేలమీదా ఇరుతావులా ఉండేది.
14.	పాకు+ఏలు = పాకేలు	సరీసృపము	నేలమీద పాకేది.
15.	తుఱ్ఱు+ఏలు = తుఱ్ఱేలు	పక్షి	తుఱ్ఱు అంటే మిన్నులో ఎగరడం. తెన్నాటి తెలుగువారిలో తుఱ్ఱు అనేమాట వాడుకలో ఉంది. పక్షిని తురవ అంటారు. పొద్దుతుఱ్ఱే (పైకెగిరే) దిక్కును తెలుగులో తూరుపు అంటాము.
16.	రొమ్ము+ఏలు = రొమ్మేలు	క్షీరదము	రొమ్ములు కలిగినది.
17.	మెడ+ఏలు = మెడేలు	జిరాఫీ	మెడ పొడవుగా ఉండేది.
18.	కత్తి + ఏలు = కత్తేలు	కడ్గమృగం	....
19.	జడ+ఏలు = జడేలు	యాక్	ఒళ్లంతా జడలు ఉండేది.
20.	గెంతు+ఏలు = గెంతేలు	కంగారూ	....

"మచ్చుకు కొన్నిమాటలే ఇవి. వేలమాటలను ఈ 'ఏలు'తో పొందించవచ్చు. నారాయణా నువ్వు గొప్ప తెలివరివి. నీ తెలివిని పెరనుడి కోసం కాకుండా అమ్మనుడి కోసం వాడు. పెరనుడి తగులా(వ్యామోహా)న్ని వదిలించికో" అంటూ ముగించినాను.

"ఇప్పుడిక ఇంటికెళ్లి ఏం వండుకొని తింటావులే అన్నయ్యా. ఇవ్వేళ మాయింట్లో నీరేలుకూర. ఇక్కడే తినేసి వెళ్లు" అన్నాడు చిన్నయ్య. నీరేలుకూర అనే మాటను విని అందరమూ హాయిగా నవ్వుకొన్నాం.

2

"అన్నయ్యా, మొన్న నువ్వు 'ఏలు'తో కొట్టిన దెబ్బకు దిమ్మతిరిగి బొమ్మ కనబడింది నారాయణకు. ఇక మన జోలికి రాడు" అంటూ వచ్చినాడు చిన్నయ్య.

నాకు ఒళ్లు మండింది. "చిన్నయ్యా నువ్వు మాట్లాడుతున్నది తప్పు. నారాయణ కూడా మనలో ఒకడు. అతని అనిపింపును అతను చెప్పినాడు. అది సరికాదు అని దిద్దినాం మనం. ఇట్ల అందరినీ వద్దనుకొంటూ ఎడం చేసుకొంటూ పోతే చివరకు మనం ఇద్దరమే మిగులుతాం. నిక్కానికి నారాయణ నీకన్నా నాకన్నా తెలివయినవాడు. నుడెసిది(బాషాశాస్త్రం)ని చదివినవాడు. సంసుక్రుతం కూడా మనిసి నోటినుండి పుట్టిన నుడే అని మరచి, అదొక వేలుపునుడి అనే తలపుతో దానిమీద పేరనుగు(తీవ్ర అబిమానం)ను ఏర్పరచుకొన్నాడు. ఆ తలపును అతనినుండి తొలగించి తెలుగుదారిని పట్టించాలి కానీ ఇట్ల ఏవగించుకోకూడదు. వెళ్లు, వెళ్లి నారాయణను పిలుచుకొని రా"

అన్నాను.

కాసేపటికి చిన్నయ్యా నారాయణా కలిసి వచ్చినారు. నారాయణ మూతిని నల్లగా పెట్టుకొని ఉన్నాడు. నేనే పలకరించినాను.

''నారాయణా, ఎందుకట్లా ఉన్నావు? మొన్న మనం పోట్లాడుకోలేదు, మాట్లాడుకొన్నాం అంతే నీకు పెరనుడి మీదున్న అక్కరను అమ్మనుడి మీదకు మరల్చాలని అనుకొంటున్నవాళ్లమే కానీ నీకు ఎదిరివాళ్లం కాము. మామీద కనలు(కోపం) పడవద్దు" అన్నాను అనుగుగా. ఆ మాటతో నారాయణ మూతి విప్పారింది.

"అన్నయ్యా, 'ఏడు' అనే చేర్పు ఒకటుందని ఆనడుమ ఒకసారి అన్నావు. ఏడు అనేది ఒక అంకె కదా!" అన్నాడు చిన్నయ్య.

"ఏడు అంటే అంకె మట్టుకే కాదు, ఏడాది కూడా. అంతేకాదు చేర్పుగా కూడా ఈ ఏడు కనబడుతుంది. వెతికే ఓపికలేక పట్టించుకోవడం లేదు మనం" చెప్పినాను.

"అయితే ఆ చేర్పును గురించి విడమరచి చెప్పవా" అడిగినాడు చిన్నయ్య..

"తెలుగులో విడి ఎసలు(గుణం) ఒకటుంది. ఉసురులు అయినా ఉరువులు అయినా, ఒకే కూటువకు చెందిన కొన్నిటికి, ఉమ్మడి కడసడులు ఉంటాయి. వాటిని మనం చేర్పులుగా వాడుకోవచ్చు. కుందేలు, తాబేలు, తోడేలు, పొట్టేలులలోని 'ఏలు'తో ఇదివరకు 'ఏలెసిది(జంతుశాస్త్రం) ఆనిమి మాటలను పుట్టించినాం కదా. ఇటువంటిదే 'ఏడు' కూడా. నేరేడు, మారేడు, తంగేడు, జిల్లేడు, బొంజేడు, ఈదేడు, నాగేడు, కోయేడు వంటి చెట్ల పేర్లలో కడసడిగా ఏడు ఉంది చూడండి. దీనిని వాడి కొత్త మాటలను పుట్టించవచ్చు" అంటూ విడమరచి చెప్పినాను.

"ఏదీ నాలుగయిదు మాటలను పుట్టించి చూపించు అన్నయ్యా" అన్నాడు చిన్నయ్య. .

"నేను మలేసియాకు వెళ్లినపుడు, అక్కడి తెలుగువాళ్లు నాకొక పండును చూపించినారు. దాని పేరు దూరియాన్. మన పనసపండును పోలి, దానికంటే చిన్నదిగా ఉంది. ఒళ్లంతా పెద్ద పెద్దవి కూచిగా ముళ్లు ఉన్నాయి. ఆ పండు తలమీద పడితే, ముళ్లు దిగబడి చనిపోతారట. దూరియాన్ అంటే 'మలే' నుడిలో ముళ్లుకలిగిన పండు అని తెల్లమట. ఆ చెట్టును కూడా దూరియాన్ చెట్టు అనే అంటారు. ఆ పండుకు తెలుగుపేరును పెట్టుమని నన్ను కోరినారు వాళ్లు. నేను 'ముళ్లేడు' అని చెప్పినాను. అట్లాగే డ్రాగన్పండు అని మనకు దొరుకుతున్నది కదా, అది మన జెముడుపండు వంటిదే. దానికి జెముడేడు అని పెట్టుకోవచ్చు. వెన్నవంటి గుజ్జు కలిగిన పండు కాబట్టి అవకాడోను వెన్నేడు అనవచ్చు. కలివిపండును పోలిన బెర్రీలను కలివేడు అనవచ్చు" అని మారాడినాను.

"నువ్వు చెప్పినదానిని ఒప్పుకొంటాను. అయినా ఇది కొత్తదేమీ కాదు. మన పెద్దవాళ్లు కూడా,రామములక, రామగుమ్మడి, సీమచింత, మొగలిపనస, సీమరేగు వంటి కొత్తపేర్లను చెట్లకు పెట్టుకొన్నవాళ్లే కదా" అన్నాడు చిన్నయ్య.

"అవును, నువ్వు చెప్పినవే కాదు, తక్కోలం, తక్కాళి(టొమేటో), బూదిపుచ్చ(బూడిదగుమ్మడి), పరంగిపుచ్చ(తియ్యగుమ్మడి), సీమపొగడ (సపోటా), చీనీనిమ్మ(బత్తాయి), గడ్డిచేమంతి, లంజిగొంజి(లంటానా), తురకవేప, గబ్బుతులసి, ఒయ్యారిబామ(పార్తీనియం).... వంటివి ఎన్నో ఉన్నాయి. అయితే ఏబై అరవై ఏళ్ల లోపు తెలుగువాళ్లలో ఈ అలవాటు అణగారిపోయింది. అన్నిచోట్లా ఉన్న ఇటువంటి మాటలను కూడా పోగేసుకోవాలి మనం. మలేసియా తెలుగువాళ్లలో బుట్టకూర (కేబేజీ), పూబుట్టకూర (కేలీఫ్లవర్) అనే మాటలున్నాయి. వాళ్లు పుట్టించుకొన్న మాటలివి. అయితే ఇవేవీ ఆనిమిమాటలుగా ఒదగవు కాబట్టి ఎసిదివి(శాస్త్రీయం)గా ఆనిమిమాటల పుట్టింపుకోసం 'ఏడు'ను తీసుకొన్నాను" చెప్పినాను.

"సరిగ్గా దీనినే అడగాలనుకొంటున్నాను. ఆ పండుకీ ఈ కాయకీ మాటలను పుట్టించడం కాదు, ఒక ఎసిదికి చెందిన ఆనిమిమాటలను పుట్టించగలగాలి. అందుకు ఈ 'ఏడు' ఒదుగుతుందా?" అంటూ డీకొన్నాడు నారాయణ.

"పూనుకొంటే పుట్టించగలం. ఎప్పుడో ఎందుకు, ఇప్పుడే పూనుకొందాం. ఏడెసిది(బోటనీ)కి చెందిన ఆనిమిమాటల గ్రీకు, లాటిను కుదురులను తడుముదాం. ఆ కుదురులకు తెలుగు కుదురులను వెతుకుదాం. తెలుగుకుదుర్లకు 'ఏడు'ను చేర్చుదాం. సరేనా నారాయణా" అంటూ మొదలిడినాను.

1.	పూత+ఏడు = పూతేడు	MAGNOLIOPHYTA	పువ్వులు పూచేది.
2.	పూత+ఆమి+ఏడు = పూతమేడు	CRYPTOGAM	పువ్వులు పూయనిది. 'అమి' అనే తెలుగు చేర్పుకు less అని తెల్లము.
3.	నీరు+ఏడు = నీరేడు	HYDROPHYTE	నీటిలో ఉండేది.
4.	తేలు+ఏడు = తేలేడు	FLOATING PLANT	నీటిలో తేలేది.
5.	మునుగు+ఏడు = మునుగేడు	SUBMERGED PLANT	నీటిలోపల ఉండేది.
6.	వరపు+ఏడు = వరపేడు	XEROPHYTE	వరపు అంటే dry. ఎడారిమొక్కలు.
7.	ఇరు+ఏడు = ఇరేడు	AMPHIPHYTE	నేలనా నీటిలోనూ ఉండేది.
8.	తీగ+ఏడు = తీగేడు	CLIMBING PLANT	....
9.	నేల+ఏడు = నేలేడు	EMBRYOPHYTA	నేలమీద బతికేది.
10.	పాచి+ఏడు = పాచేడు	BRYOPHYTE	....
11.	కాడ+ఏడు = కాడేడు	HORNEOPHYTOPSIDA	ఆకులు లేకుండా కాడలు మట్టుకే ఉండేది.

12	నలి+ఏడు = నల్లేడు	MARCHANTIOPHYTA	ఇది ఒక ఎసిదరి పేరుతో పొందించిన ఇంగ్లీసు పేరు. నల్లేరులాగా పలకలకాడ కలిగినది. అందుకే నల్లేడు అన్నాం. పలకేడు అని కూడా అనవచ్చు.
13.	తూడు+ఏడు = తూడేడు	TRACHEOPHYTE	తూడు కలిగినది.
14.	బిత్తలి+ఏడు = బిత్తలేడు	RHYNIOPHYTA	ఆకులు లేకుండా బిత్తలి(నగ్నము)గా ఉండేది.
15.	డాబు+ ఏడు = డాబేడు	ZOSTEROPHYLLOPHYTA	డాబు అంటే girds. డాబు వంటి ఆకులు గలది.
16.	నక్క+అడుగు+ఏడు=నక్కడుగేడు	LYCOPODIOPHYTA	తోడేలు అడుగువంటి ఆకులు కలది అని తెల్లము. పొందించడానికి చిన్నదిగా ఉంటుందని తోడేలును నక్కను చేసినాం. తోడేలడుగేడు అని కూడా అనవచ్చు.
17.	మూ+పాయ+ఏడు = ముప్పాయేడు	TRIMEROPHYTOPHYTA	మూడు పాయలుగా చీలిన ఆకులుకలది.
18.	ఆకు+ఏడు = ఆకేడు	PTERIDOPHYTA	కాండం, కొమ్మలు లేకుండా ఆకులు మట్టుకే ఉండేది.
19.	విత్తు+ఏడు = విత్తేడు	SPERATOPHYTE	విత్తులు కలిగి ఉండేది.
20.	విత్తు+ఆకు+ఏడు = విత్తాకేడు	PTERIDOSPERMATOPHYTA	ఆకేడులోనే విత్తులు కలిగినది.
21.	మొగలి+ఏడు = మొగలేడు	PINOPHYTA	మొగలి వంటిది.
22.	ఈత+ఏడు = ఈతేడు	CYCADOPHYTA	ఈత వంటిది.
23.	వెలివిత్తు+ఏడు = వెలివిత్తేడు	GYMNOSPERMAE	వివృతబీజ వృక్షం.
24.	లోవిత్తు+ఏడు = లోవిత్తేడు	ANGIOSPERMAE	ఆవృతబీజ వృక్షం.
25.	ఒకబద్ద+ఏడు = ఒకబద్దేడు	MONOCOTYLEDON PLANT	ఏకదళ బీజపు మొక్క.
26.	కవబద్ద+ఏడు = కవబద్దేడు	DECOTYLEDON PLANT	ద్విదళ బీపు మొక్క.
27.	బూజు+ఏడు = బూజేడు	FUNGI	శిలీంధ్రం.
28.	నాచు+ఏడు = నాచేడు	ALGAE	శైవలం.

"అంతా బాగుంది కానీ, ఇన్ని ఇంగ్లీసు మాటలకు తెలుగుమాటలను పొందించినామే, సంసుక్రుతము నుండి వచ్చినవాటికి తెలుగుపేర్లను పొందించగలమా? మచ్చుకు, ద్రాక్షకు తెలుగుపేరును చెప్పు చూద్దాం" అంటూ తగులుకొన్నాడు చిన్నయ్య.

"తప్పక చెప్పగలను కానీ, ఆ సంసుక్రుతములోకి పోయిన తెలుగుమాటలెన్నో ఉన్నాయి. కసరు చవి కాకరకాయను కూడా సంసుక్రుతము నుండి దిగుమతిగా చెప్పుకొనే మనవాళ్లకు తెలుగు కుదుర్లను వెతికే కోరిక ఎక్కడిది చెప్పు. ద్రాక్ష అంటే దప్పిని తీర్చేది కాబట్టి దప్పేడు అని పెట్టుకోవాలి" అని ముగించినాను.

(తరువాయి వచ్చే సంచికలో...)








తప్పక చదవవలసిన 4 పుస్తకాలు

ప్రముఖ రచయిత, కవి, నాటకకర్త, హేతువాది డా॥ మలయశ్రీ రచనలు

తొలి తెలుగు చక్రవర్తులు 1,2 భాగాలు:

కాకతీయులే మన తెలుగు సమస్తాంధ్రసామ్రాట్టులు. తొలి దశలో తొమ్మిది పది దశాబ్దాలలో కాకతీయులు చాళుక్య రాష్ట్రకూటులకు దండనాధులుగా, మలిదశ - 11వ శతాబ్దిలో కళ్యాణి చాళుక్యులకు సామంతులు. 1158 నుంచి 1323 వరకు వీరు స్వతంత్ర చక్రవర్తులు. కాకతి చక్రవర్తులలో ప్రముఖులు నలుగురు. వీరి చరిత్రలు - జనజీవితాలను చిత్రిస్తూ డా॥ మలయశ్రీ నాలుగు చారిత్రక నాటకాలను రచించారు. ఒకటవ భాగంలో శ్రీ కాకతీయరుద్రదేవచక్రవర్తి(1158-1195), శ్రీ కాకతి గణమతిదేవ చక్రవర్తి(1199-1262), రెండవ భాగంలో మహారాణి కాకతిరుద్రమదేవి(1262-1289) శ్రీ కాకతి రెండవప్రతాపరుద్ర చక్రవర్తి (1290-1328) మొదటిభాగం రు.100లు, రెండవభాగం రు 100లు.

పరిష్కారం, మరి 15 కథలు - రు.100లు రచయిత : డా॥ మలయశ్రీ

నిజమైన వేమన పద్యాలు - రు.100లుఎంపిక- కూర్పు-భావాలు : డా॥ మలయశ్రీ

పుస్తకాలకోసం డా॥మలయశ్రీ 1-113/7, ఆదిత్యభవన్, వేమననగర్, రేకుర్తి, కరీంనగర్-505 451(తెలంగాణ) ఫోన్: 98665 46220

స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

③

"అన్నయ్యా, నిన్ను ఒకమాట అడగాలనుకొంటున్నాను. అయితే నా అడక(ప్రశ్న)కు నీ తిరువు(జవాబు) దురుసుగా ఉంటుందేమో అని జంకుతున్నాను" అన్నాడు నారాయణ. "అదే నారాయణా వద్దనేది. పెరనుడుల మీది తగులం(వ్యామోహం)తో తెలుగును ఈసడించుకొనేది నువ్వు. 'తెలుగు అనే పులుగుకు, సంసుక్రుతం ఇంగ్లీసు అనేవి రెండు రెక్కలు, ఏ రెక్క తక్కువయినా తెలుగు ఎగరలేదు' అనింది నువ్వు. 'ఆనిమిమాటల పుట్టింపుకు తెలుగు చేవలేనిదీ చేతకానిదీ' అని వెక్కసమాడింది నువ్వు. నీ కరకుమాటలకు మారుపలుకుతున్నాడు అన్నయ్య. అవి నీకు దురుసుగా అనిపిస్తున్నాయా?" అంటూ గయ్యిమని లేచినాడు చిన్నయ్య..

"చిన్నయ్యా, జరిగిపోయిన పెళ్లికి మేళమెందుకు ఊరకుండు. నారాయణా, చిన్నయ్య మాటల్ని పట్టించుకోకు. తెలుగుమీద మాకెంత అక్కరా అనుగూ ఉందో నీకూ అంతే ఉందని నేనెరుగుదును. నువ్వు నడచివచ్చిన దారి వేరు, నేను నడవమంటున్న దారి వేరు. ఈ గజిబిజి నుండి బయటపడుతావులే. ఇంతకీ నువ్వు అడగాలనుకొన్నది ఏమిటో అడుగు' అన్నాను నేను కలిపించుకొంటూ.

"ఏమీ లేదు అన్నయ్యా. తామరపువ్వుకు తెలుగులో, తామర, తమ్మి వంటివి రెండో మూడో పేర్లున్నాయి అంతేకదా! అదే సంసుక్రుతంలో అయితే బోలెడుమాటలు కనబడుతాయి. అంబుజ, అబ్జ, ఉదజ, కంజ, జలజ, తోయజ, నీరజ, పంకజ, పయోజ, వనజ, వారిజ, సరసిజ, సరోజ వంటివి ఇంకా ఎన్నో ఉన్నాయి. అట్లాంటప్పుడు సంసుక్రుతం కన్నా తెలుగు గొప్పనుడి ఎట్లా అవుతుంది?" అని అడిగినాడు నారాయణ.

"నారాయణా, నువ్వు బాగా బాగా గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, నేను ఎన్నడూ కూడా సంసుక్రుతం కంటే తెలుగు గొప్పది అనలేదు. అట్లాగే తెలుగుకంటే సంసుక్రుతమూ గొప్పది కాదు. దేని గొప్పతనం దానిది. సంసుక్రుతం దాదాపు వెయ్యేళ్లు బారతనాడులో పెననుడిగా ఉండేది. పలునుడులు ఉండే నాడుల్లో ఎసిదానిమి (శాస్త్రసాంకేతిక) అక్కరలకు ఒక పెననుడి కానే కావాలి. మన బారతనాడులో పాళీ, సంసుక్రుతం నుడులు ఎక్కువతావుల్లో ఎక్కువతరిలోనూ, పారసీకం తక్కువ తావుల్లో తక్కువ తరిలోనూ పెననుడులుగా ఉన్నాయి. ఇటీవల రెండు మూడు వందలేళ్ల నుండి ఇంగిలీసు మన నాడుకంతా పెననుడిగా ఉంది. ఇంగిలీసు, పారసీక నుడులలో వెలువడిన ఎసుదు(శాస్త్రా)లన్నీ బయట నుండి వచ్చినవే. పాళీ సంసుక్రుతాల్లో వచ్చిన ఎసుదులు అప్పటంగా ఈనేలవి. బారతనాడులో పలునుడులకు చెందిన ఎసిదరులు కనిపెట్టినవన్నీ పెననుడి అయిన సంసుక్రుతంలో వెలువడినాయి. మచ్చుకు మనికిమినుకు(ఆయుర్వేదం)నే తీసుకొందాం. పలునుడుల ఎసిదరులు ఒకచోట కూర్చుని ఒక మొక్క గురించి మాట్లాడుకోవాలి. తమిళంలో దాని పేరు 'తొట్టాచినంగి', తెలుగులో 'అత్తిపత్తి'. తెలుగులో కూడా అత్తిపత్తి, సిగ్గుగొడ్డ, లజ్జటాలు, ముదుగుతామర అని తావుతావుకూ దాని పేరు మారుతుంది. ఏ పేరుతో ఆ మొక్కను పొదక(రికార్డ్) చేయాలి? అందుకోసమే పెననుడి కావాలి. ఆ పెననుడిని తెలివరులు అందరూ నేర్చుకొంటారు. మననాడులోనే పుట్టిన మనికిమినుకు వంటి ఎసుదులన్నీ సంసుక్రుతంలో ఉండడానికి కతము ఇదే."

"అన్నయ్యా, నారాయణ అడిగినదానికీ నువ్వు చెబుతున్నదానికి పొంతన కుదరడం లేదు. నారాయణ తామరకు చెప్పిన సంసుక్రుతం మాటలన్నీ ఎసిదానిమి మాటలే అంటావా?" నడుమన దూరినాడు చిన్నయ్య.

"అక్కడికే వస్తున్నాను కాస్త ఆగు చిన్నయ్యా, పెననుడిగా మారిన నుడి ఎసిదినుడిగా మట్టుకే కాదు, ఎన్నువ(కళ)నుడిగా కూడా ఎదుగుతుంది. ఎన్నువకు చెందిన నెన్నొడికూడా అందులో ఏర్పడుతుంది. అల్లిక(రచన) అనేది ఒక ఎన్నువ కదా. పాతతరిలో అల్లికలంతా పడిక(పద్యం)లుగా ఉండేవి. ఆ పాడికలు అల్లడానికి కొలువడి(చందస్సు)ఉండేది. ఆ కొలువడికి తగినట్లుగా మాటలు కావలసి వచ్చేవి. అల్లికరు(రచయిత)లు కొంగొత్త మాటలను ఎన్నో కొలువడికి తగినట్లు పుట్టించేవారు. ఇదంతా సంసుక్రుతంలో పెద్దయెత్తున జరిగింది. అట్లా పుట్టిన మాటలే పైన నారాయణ చెప్పినవి. దానినే పలుకొడమి(పదసంపద) అంటాం. తెలుగులో అల్లిక మొదలయ్యే నాటికి, సంసుక్రుతంలో పలుకొడమి ఎంతో ఎదిగి ఉండేది. తెలుగు అల్లికరులు ఆ మాటలనే తీసుకొని వాడేసినారు. కొత్త మాటల పుట్టుకకు పూనుకొన్నవారు కొద్దిమందే. వాళ్లు కూడా చాలా పొదవయిన మాటలనే ఎక్కువగా పుట్టించినారు. ఎన్నువ నెన్నొడిని కూడా తెలుగులో పుట్టించి పెంపొందించవచ్చు. ఆ పని కూడా జరుగవలసిందే. ముందు ఎసిది నెన్నొడిని పుట్టించి, వాటిని బడిలో నేర్పుతూ ఉంటే, ఎన్నువమాటలను పుట్టించేవారు వారంతట వస్తారు. సంసుక్రుతంలో 'జన్మ' అనే మాటలోని 'జ' సడికి 'పుట్టుక' అనే తెల్లంను కల్పించి; అంబు, ఉద, జల, కం, తోయ, నీర, పంక, వన, పయ, వారి, సరసి, సరో వంటి కుదురులకు, 'జ'ను చేర్పుగా చేర్చి బోలెడు ఎన్నువమాటలను పుట్టించినారు కదా. అట్లాగే 'కను, కనుబడి, కలిమి' వంటి పుట్టుకకు చెందిన తెలుగుమాటలలోని తొలిసడి అయిన 'క'ను చేర్పుగా చేర్చి తెలుగులో తామరకు కొంగొత్త ఎన్నువమాటలను పుట్టించవచ్చు. అడుసుక, అవుసుక, ఈరుక, ఊటుక, ఏటిక, కుళంక, కొలకుక, కొలనుక, కొళముక, కొళ్నుక, కోడుక, చదుకుక, చింకక, చిత్తడిక, చెర్వుక, చెల్మక, జౌకుక, జేడక, టెంకిక, దొనక, దొర్వుక, నీరుక, నీర్క నీళుక, పడియక, పద్యక, బురదక, మడుగుక, మడువుక, లట్టుక, లొందుక, వెంచక, వెళ్లక, వెల్లక, రొంపిక, సెలక.... ఇట్ల పుట్టించుకొంటూ వెళ్లవచ్చు. అట్లాగే 'పడయు, పడతి, పడుపు వంటి మాటలలో పుట్టుకకు చెందిన తెల్లం కనబడుతున్నది కదా, వాటిలోని 'ప' సడిని కూడా చేర్చుకొని తామరకు మరిన్ని మాటలను పుట్టించవచ్చు. 'పుట్టు, పుట్టుక, పుట్టుగు, పుట్టుబడి, పుట్టువ'లలోని 'పు'ను తీసుకొని ఇంకొన్ని మాటలను

పుట్టించవచ్చు" అని విడమరచినాను.

"ఎందుకనో ఈ మాటలను నేను ఒప్పుకోలేకపోతున్నాను. మాట మొదటి వ్రాత(అక్షరం)ను తీసుకొని దానిని చేర్పు అనడం ఒప్పుదల కాదేమో" అన్నాడు నారాయణ.

"అవునవును, ఎందుకు ఒప్పుదల అవుతుంది? అన్నయ్య చెప్పింది తెలుగుమాటల గురించి కదా! అదే సంసుక్రుతం గురించి అయితే అన్నయ్యేమిటి, నేను చెప్పినా ఒప్పుదల అవుతుంది. 'నీవు నేర్పిన చద్వుయే నీర్పుగంటి' అన్నట్లు, 'జన్మ'లోని తొలిసడి అయిన 'జ'ను తీసుకొని సంసుక్రుతంలో మాటలను పుట్టించినట్లే తెలుగులోనూ చేసినాడు అన్నయ్య. ఇందులో తప్పిదం ఏముంది, ఒప్పుదల కానిది ఏముంది? తాను చేస్తే కాపురం, ఇంకొకర్తి చేస్తే రంకు అన్నదట వెనకటికి ఒకావిడ. అట్లాగుంది నువ్వు చెప్పేది" అని నారాయణను వెక్కసమాడినాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, ఎంత చక్కచేసినా కుక్కతోక వంకరే అన్నట్లు ఎంత చెప్పినా నీ తెలివి తేటగిల్లడం లేదు. నారాయణ మీద ఎందుకలా విరుచుకుపడుతావు" అని చిన్నయ్యను కసరినాను.

"కుట్టినమ్మ కుదురుగా ఉంది, అరిచినమ్మ తెరువుకెక్కింది అన్నట్లు, తెలుగునీ నిన్నూ అగడుగా మాట్లాడే నారాయణేమో మంచివాడు, నేనే చెడ్డవాడినయ్యాను" నొచ్చుకొంటూ అన్నాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, నువ్వు కూడా నొచ్చుకొంటే ఎట్లా? కాత ఉండే మానుకే రాతిదెబ్బలు. నలుగురు మనల్ని తెగడుతున్నారంటే మనదగ్గర ఏదో సరుకు ఉండబట్టే కదా! మనం ఈ పూటకి ఇక ఎన్నువ మాటల్ని పక్కన పెట్టి ఎసిదిమాటలను గురించి ముచ్చటించుకొందాం సరేనా" అన్నాను. –

"చిన్నయ్యా, నన్ను మన్నించు. ఇదివరకటిలాగా కాదు, నేనూ కొంత మారినాను. ఇంకా మారుతాను. నాకు కూడా తెలుగంటే మక్కువే" వేడుకొంటున్నట్లుగా అన్నాడు నారాయణ. ఆ మాటతో చిన్నయ్య హాయిగా నవ్వేసినాడు.

"ఏదయినా ఒకమంచి చేర్పును గురించి చెప్పు అన్నయ్యా" అన్నాడు నారాయణ.

"చెపుతాను వినండి. 'అరము' అనే చేర్పు గురించి మాట్లాడుకొందాం. దీనిని 'అరం' అని కూడా రాసుకోవచ్చు. ఈ చేర్పు వెనుక చాలా మెలన(చరిత్ర) ఉంది. ఇది తెల్లం లేని వట్టి చేర్పు మట్టుకే కాదు. ఇది తెల్లమున్న మాట. తెలుగు నుడిగంటలకు ఇంకా ఎక్కనిమాట. ఎక్కించుకొని తీరవలసినమాట. అరం అంటే, డ్యూటీ లేదా దర్మం. తమిళ నుడిగంటులలో ఈ మాట కనపడుతుంది. దర్మం అనే సంసుక్రుతపు మాటకు తమిళమాటగా ఉంటుంది. దీనిని చూసిన వెంటనే మన పెద్దలు, ఇది తమిళమాట అని చాటేస్తారు. నిక్కానికి ఇది తెలుగుమాట. తెలుగునుండే తమిళానికి వెళ్లి ఉండాలి. ఎందుకంటే తెలుగువాళ్లం వాడినంత ఎక్కువగా తమిళులు ఈ మాటను వాడడం లేదు. వాడుక తమిళంలో ఈ మాట లేనేలేదు. కానీ వాళ్ల నుడిగంటులకు ఎక్కింది, మనం పట్టించుకోలేదు, అంతే.

బారతనాడులోని అన్ని నుడిగుంపులలో తెలుగువాళ్లే మునుముందుగా కనుబడి(ఉత్పత్తి) మట్టుకు ఎదిగిన వారు అని చెప్పే ఆనవాళ్లలో ఒకటి ఈ అరం. తిండిని వెతుక్కొంటూ ఎడువుకొంటూ(సేకరించుకొంటూ) అచ్చోటా ఇచ్చోటా తిరిగే మట్టునుండి, తిండిని పండించుకొంటూ ఒకచోటున కుదురుకొనడాన్నే కనుబడిమట్టు అంటారు. ఈ మట్టులో పనిపంపకం జరుగుతుంది. నేర్పరితనంతో కూడిన పనినే అరం అంటాం. ఎవరైనా ఎప్పుడైనా చేయగలిగేది 'పని'. బాగా నేర్చుకొని నెరతనం పొందినాక చేసేది అరం. ఇంగ్లీసులో వర్క్ డ్యూటీ అనే మాటలకు ఉన్న వేరిమే ఈ రెండు తెలుగుమాటల నడుమనా ఉంది.

అరంతో కూడిన మాటలు తెలుగులో చాలా ఉన్నాయి. కుమ్మరం, కమ్మరం, మేదరం, నేతరం, కంచరం, వడ్డరం, కాలరం వంటివి వాటిలో కొన్ని. ఇట్ల పలుపనులకు ఒకటే చేర్పుతో మాటలు ఉండడం ఒక్క తెలుగులోనే చూడగలం. అంటే తెలుగువాళ్లు అంత నేటుగా పనులను పంచుకొన్నారు. కనుబడిమట్టుకు తొట్టతొలిగా రావడం వల్లనే ఇటువంటి మాటలు పుడుతాయి. ఇంకొకరిని చూసి నేర్చుకొని కనుబడిలోకి వచ్చినవారిలో ఉమ్మడిచేర్పులతో మాటలు ఉండవు. వేలయేళ్ల కిందటనే తెలుగువాళ్లు కనుబడిమట్టుకు చేరుకొన్నారు అని 'అరం' నొక్కి చెపుతూ ఉంది. మనం కూడా అరంతో ఎన్నో కొంగొత్త ఎసిదానిమి మాటలను పుట్టించవచ్చు" అంటూ మాటల పుట్టింపును మొదలిడినాను.

1. తోలు + అరం = తోలరం డ్రైవింగ్
2. నడుపు + అరం = నడుపరం కండక్టింగ్
నిర్వహణ అంటున్నారు.
3. తోము + అరం = తోమరం క్లీనింగ్
4. మర + అరం = మరవరం ఇంజనీరింగ్
5. నీటి + అరం = నీటరం ప్లంబింగ్
6. మిను + అరం = మిన్నరం ఎలక్ట్రికల్ వర్క్
మిను అంటే ఎలక్ట్రానిక్. మించు అంటే ఎలక్టిసిటీ.
7. పసను + అరం = పసనరం పెయింటింగ్
పసను అంటే రంగు. రంగులు వేయడం.
8. పొల్లు + అరం = పొల్లరం టైలరింగ్
పొల్లు అంటే కుట్టడం. కుట్టరం అని కూడా అనవచ్చు.
9. ఉడిగ + అరం = ఉడిగరం సర్వింగ్
ఉడిగం అంటే సేవ.
10. కరపు + అరం = కరపరం టీచింగ్
కరపు అంటే నేర్పడం.
11. జరుపు + అరం = జరుపరం మేనేజింగ్
దీనిని కూడా నిర్వహణ అంటున్నారు.
12. కూర్చు + అరం = కూర్పరం. ఎడిటింగ్...
సంపాదకత్వం అంటున్నారు.
13. మార్పు + అరం = మార్పరం. ట్రాన్స్‌లేషన్..
అనువాదం అంటున్నారు.
14. వళుకు + అరం = వళుకరం. అడ్వొకసీ
వళుకు అంటే వాగ్వాదం.
15. కనుగాపు + అరం = కనుగాపరం సూపర్వైజింగ్
కనుగాపు అంటే బాగా చూసుకోవడం. పర్యవేక్షణ అంటున్నారు.

“మచ్చుకు ఈ కొద్దిమాటలను చెప్పినాను. మన అక్కరలకు కావలసినన్ని ఆనిమి మాటలను ఈ ‘అరం’తో పుట్టించుకోవచ్చు” అని ముగించినాను.

4

“**నా**కొక అరగలి(సందేహం) అన్నయ్యా, కొంగొత్త పనులకు ‘అరం’ చేర్పుతో తెలుగుమాటలను పుట్టించినాం కదా, ఆ పనులతో పాటు పనులను చేసేవారికి కూడా తెలుగుమాటలు ఉండాలి కదా, ఎందుకంటే, నువ్వు డ్రైవింగ్ కు తోలరం అన్నావు. ఆమాటకు తెలివరులు పేరు పెట్టలేదు కానీ, డ్రైవర్‌కు ‘చోదకుడు’ అని పేరును పెట్టున్నారు మన నుడివరులు” నారాయణను ఓరకంట చూస్తూ అన్నాడు చిన్నయ్య.

చిన్నయ్య మాటలకు నారాయణ నవ్వుతూ, “చిన్నయ్యా, ఇప్పుడిక నీ మాటలకు నేనేమీ ఉడుక్కోనులే” అని చిన్నయ్యతో అని, నావైపు చూసి, “అన్నయ్యా, కుమ్మరం చేసేవాడు కుమ్మరి, మేదరం చేసేవాడు మేదరి, కమ్మరం చేసేవాడు కమ్మరి కదా. ఈ మాటల్లోని ‘అరి’ ఇక్కడ చేర్పు అవుతుంది కదా” అన్నాడు.

నాకు ఎంతో ఎలమి (సంతోషం) కలిగింది. “నువ్వు సరిగ్గా తలపోస్తున్నావు నారాయణా. ‘అరి’తో కొత్త మాటలను పుట్టిద్దాం పట్టు” అన్నాను. ముగ్గురమూ కలిసి ఓ పట్టు పట్టినాం.

1. తోలు + అరి = తోలరి డ్రైవర్
2. నడుపు + అరి = నడుపరి కండక్టర్
3. తోము + అరి = తోమరి క్లీనర్
4. విరుగు + అరి = విరుగరి డాక్టర్
విరుగు అంటే చికిత్స.
5. మర + అరి = మరవరి ఇంజనీర్
మర అంటే ఇంజిన్.
6. వళుకు + అరి = వళుకరి అడ్వొకేట్
7. తీర్పు + అరి = తీర్పరి జడ్జ్
8. తోడు + అరి = తోడరి హెల్పర్
9. నీటి + అరి = నీటరి ప్లంబర్
10. పొందు + అరి = పొందరి కన్జ్యూమర్
పొందేవాడు. గ్రాహకుడు అని వాడుతున్నారు.
11. ఈవి + అరి = ఈవరి సబ్‌స్క్రైబర్
ఇచ్చేవాడు చందాదారుడు అని వాడుతున్నారు.
12. మిను + అరి = మిన్నరి ఎలక్ట్రీషియన్
13. పసను + అరి = పసనరి పెయింటర్
14. పాట + అరి = పాటరి సింగర్
గాయకుడు అంటున్నారు.
15. ఆట + అరి = ఆటరి స్పోర్ట్స్‌మేన్
క్రీడాకారుడు అంటున్నారు.
16. ఈదు + అరి = ఈదరి స్విమ్మర్
17. పరుగు + అరి = పరుగరి రన్నర్
18. ఉరుకు + అరి = ఉరుకరి రేసర్
19. పొల్లు + అరి = పొల్లరి టైలర్
20. ఉడిగం + అరి = ఉడిగరి సర్వర్
21. జరుపు + అరి = జరుపరి మేనేజర్
22. చేత + అరి = చేతరి సెక్రెటరీ
23. ఉబుసు + అరి = ఉబుసరి మెసెంజర్
ఉబుసు అంటే మెసేజ్.
24. కరపు + అరి = కరపరి టీచర్
ఉపాధ్యాయుడు అంటున్నారు.
25. చదువు + అరి = చదువరి రీడర్
పాటకుడు అంటున్నారు.
26. కూర్చు + అరి = కూర్పరి ఎడిటర్
సంపాదకుడు అంటున్నారు.
27. చనవు + అరి = చనవరి ఆఫీసర్
చనవు అంటే అదికారం. అదికారి అంటున్నారు.
28. మార్చు + అరి = మార్పరి ట్రాన్స్‌లేటర్
29. కనుగాపు + అరి = కనుగాపరి సూపర్‌వైజర్
పర్యవేక్షకుడు అంటున్నారు.
30. తిరుగు + అరి = తిరుగరి టూరిస్ట్
పర్యాటకుడు అంటున్నారు.
31. అనుపు + అరి = అనుపరి కలెక్టర్ అనుపు అంటే పన్ను (టాక్స్). పన్నులను కలెక్ట్ చేసేవాడు. కరగ్రాహి అనే పేరును పెట్టినారు.
32. అలము + అరి = అలమరి సంచారి
అలము అంటే తిరగడం. ఈ మాట చిన్నమార్పుతో అలబరిగా నెల్లూరు తావున వాడుతున్నారు.
33. దొమ్ము + అరి = దొమ్మరి యోదుడు
దొమ్ము అంటే కొట్లాట లేదా పోరాటం.
34. మాటాట + అరి = మాటాటరి లెక్చరర్
మాటాట అంటే ప్రసంగం లేదా లెక్చర్. ఉపన్యాసకుడు అంటున్నారు.
35. పలుకు + అరి = పలుకరి స్టూడెంట్
పలుకు అంటే విద్య. విద్యార్థి అంటున్నారు.

“చాలు చాలన్నయ్యా, అబ్బ ఎన్నిమాటలో” అరుదు(ఆశ్చర్యం)పడుతూ అన్నాడు చిన్నయ్య. “మన తెలుగునుడి చేవ అటువంటిది చిన్నయ్యా” అంటూ ముగించినాను నేను.

(తరువాయి వచ్చే సంచికలో...)

భాషలు మసకబారినప్పుడు ప్రపంచ సాంస్కృతిక వైవిధ్యం కూడా మసకబారుతుంది. మనవైన అవకాశాలూ సంప్రదాయాలూ చారిత్రిక నైపథ్యం, మనకే సొంతమైన ప్రత్యేక ఆలోచనా సరళీ విలువైన మానవ వనరులూ కనుమరుగైపోతాయి. –యునెస్కో

స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

5

"అన్నయ్యా, నువ్వేమో తెలుగుమాటలకు గూటాలు ఉండవు, ఉండకూడదు అంటావు. అయితే అన్ని ఆకికల్లోనూ అందరూ, ముప్పై, నలబై,ఏబై,డెబ్బై,తొంబై అనే మాటలకు గూటలను పెట్టే రాస్తున్నారే! ఇవి తెలుగుమాటలు కావా, లేకుంటే కావాలనే తప్పుగా రాస్తున్నారా?" అడిగినాడు చిన్నయ్య.

"నాకు కూడా చాన్నాళ్లుగా అరగలి(సందేహం) ఇది. ఇవి తెలుగు మాటలే. మూడుపదులు ముప్పది. అదే ముప్పయి అయింది. 'పది'లో 'ప'కు గూటం లేదుకదా. ముప్పయి, నలబయి, ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయిలలో ఎలా వచ్చిందో!" నారాయణ కూడా అడిగాడు.

"అబ్బాయిలూ చెపుతాను వినండి. మీకేకాదు, తెలుగు వ్రాతలు నేర్చుకొన్నప్పటి నుండి నాకు కూడా అరగలే ఇది. కొన్నేళ్ల కిందట జరిగిన ముచ్చటను చెప్పాలి ఇక్కడ. ఏడాది నాకు సరిగ్గా గురుతు లేదు కానీ, తెలుగు తెలివరులు, తెలుగునుడికి కూడా చెన్నుడి(క్లాసికల్ లాంగ్వేజ్) గుర్తింపు ఇవ్వాలని గట్టిగా అడుగుతున్న నాళ్లు అవి. మైసూరులో బారతనుడుల నట్ట తెట్టువ(సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) నుండి నాకూ మా బాబాయికీ పిలుపు వస్తే బయలుదేరి వెళ్లినాం"

"బాబాయి అంటే అమ్మనుడి ఆకిక కూర్పరి సామల రమేష్‌బాబుగారే కదా" నడుమన దూరి అడిగినాడు చిన్నయ్య.

"అవును ఆయనే. అప్పుడు ఆకికపేరు అమ్మనుడి కాదు, నడుస్తున్న చరిత్ర అని ఉండేది. మేమిద్దరమూ నుడివరులం కాము. కానీ తెలుగు ఎదుగుదల మీద అక్కర ఉన్నవాళ్లం. అందుకే కావచ్చు మాకు కూడా పిలుపువచ్చింది. మునివాపు వేళకు మైసూరుకు వెళ్లినాం. మాకు ఒక విడిదిలులో ఒక గదిని చూపించినారు. పైకి పోసుకొని(స్నానమాడి), ఉడుపులు మార్చుకొని, విడిదిలు బయటకు వచ్చినాం. చక్కని పచ్చికబయులులో చల్లగా కూర్చుని ముచ్చట్లాడుకొంటున్నారు ఏడెనిమిదిమంది పెద్దలు. అందరూ తెలుగువారే. అందరూ నుడివరు(బాషావేత్త)లే. మేము వెళ్లి వాళ్లతో కలిసినాం. నాకేమో కాస్త జంకుజంకుగా ఉంది. ఎందుకంటే నుడెసిది(బాషాశాస్త్రం)లో తలపండిన వాళ్లు వాళ్లంతా. ఏం మాట్లాడితే ఏం చిక్కు వస్తుందో అని మెదలకుండా కూర్చునున్నాను. వారిలో నేనెరిగిన వారు ముగ్గురున్నారు. బాబాయి నోరు విప్పినారు. ముప్పయి, నలబయి వంటి తెలుగుమాటలకు గూటాలు పెట్టడం తప్పుకాదా అని అడిగేసినారు..."

"ఏమయింది ఆనక? నువ్వు అడిగుంటే మారాడకపోయి ఉండవచ్చు. పెద్దాయనే అడిగేసినారు కదా, ఏదో ఒకటి చెప్పుండాలే" తమిగా అడిగినాడు చిన్నయ్య, నడుమన దూరి.

"అవును చిన్నయ్యా, నువ్వన్నది నిక్కమే. ఆ మాటను నేను అడిగి ఉంటే పట్టించుకొని ఉండరు. నన్నేమిటి, పెద్దాయననే పట్టించుకోలేదు కాసేపు. ఇంకా నొప్పి కొద్దిగానైనా సలుపుతూనే ఉంది నన్ను ఇప్పటికీ. అంచల గుంపులోకి రెండు కాకుల వెళితే ఊరుకొంటాయా, చీదరించుకొంటాయి, పొడిచి తరుముతాయి. కానీ వెళ్లింది కాకులు కాదు, పదునైన గోళ్లూ ముక్కులూ ఉన్న గ్రద్దలు. తరుమలేక పట్టించుకోనట్లు ఊరుకొన్నాయి..."

"అన్నయ్యా, వెక్కసం మాటలాడవద్దని నన్ను ఎప్పుడూ కసరుతుంటావు. నువ్వు ఇలా మాట్లాడుతున్నావేమిటి?" అన్నాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, నడుమన దూరకు. అన్నయ్యను మాట్లాడనీ. ఇంకా ఎన్నాళ్లని ఈ తలవంపుల్ని దాచిపెట్టుకొని ఉంటాడు. బయటపెట్టనీ. అన్నయ్యవి వెక్కసపు మాటలు కావు. నొప్పితో పలుకుతున్న పలుకులు. చెప్పనీ ఊరకుండు" అన్నాడు నారాయణ.

"సరే అన్నయ్యా, నడుమన దూరను. ఇంతకీ ఏమయిందో చెప్పు" అడిగినాడు చిన్నయ్య.

"కాసేపు పట్టించుకోనట్లు ఉండి, వారిలో ఒకరు, 'అవి రూఢి(వాడుక) అయిపోయిన మాటలండీ, వాటిని ఇప్పుడేమీ చేయలేం' అన్నారు. 'ఏదో చేయాలని కాదండీ, అలా వాడడం సరయినదేనా' అన్నారు బాబాయి. 'సరయినదే. అది తెలియాలంటే, మీకు ద్రావిడనుడులన్నిటి గురించీ కొంతయినా తెలిసుండాలి. నుడెసిదిని సుంతయినా చదివుండాలి. తమిళంలో ముప్పదు, నాప్పదు అనే మాటల్లో 'ప్' వినిపిస్తుంది కదా. అదే పెద్దుసురు(మహాప్రాణం)గా మారింది తెలుగులో. దానిని గూటం అనకూడదండీ' అని తేల్చేసినారు. ఇంకొక పెద్ద. నేను ఊరుకోలేక, 'మరి ఐంబదు, ఎళువదు, ఎంబదు, తొన్నూరులలో 'ప్' లేదు కదండీ. ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయిలకు గూటాలు ఎందుకొచ్చినాయి?' అని అడిగినాను. వారి మోము నల్లబడింది. ఇంకొక పెద్ద కల్పించుకొని, 'తినేసి పడుకోవాలి కదా లేవండి' అంటూ ముగించేసినారు. పొగరుతో చెపుతున్నది కాదు నారాయణా. ద్రావిడనుడులు అన్నిటి గురించీ కొంతయినా తెలిసుండాలి అని, తమిళాన్ని ఆనుగా తెచ్చుకొన్న పెద్దకంటే, నాకే ఎక్కువ తమిళం తెలుసు. అది వారికి అప్పటికి తెలియదు అంతే. ఇటువంటి పట్టనితనాలూ పక్కకు తోసివేయడాలూ పిలిచి గొడవ పెట్టుకోవడాలూ చాలా చేసినారు నాపట్ల కొందరు. ముందుముందు మరికొన్ని చెప్పుకొందాంలే" అంటూ మారాడినాను.

"ఇంతకీ ఆ ముగ్గురిపేర్లు చెప్పనేలేదు అన్నయ్యా నువ్వు" అడిగినాడు చిన్నయ్య.

"అక్కరలేదు చిన్నయ్యా, చెప్పాలనుకొని ఉంటే అన్నయ్యే చెప్పేవాడు కదా" అన్నాడు నారాయణ.

"అవును చిన్నయ్యా, వాళ్లు ముగ్గురూ నిక్కంగానే చాలా గొప్పవారు. తెలుగునుడికి ఎంతో ఉడిగం చేసినారు. పేర్లు అచ్చుకు

ఎక్కించి అగడుచేయడం పాడి కాదు" అన్నాను.

" అది సరే అన్నయ్యా, ముప్పై, నలబై, ఏబై...లకు గూటాలను పెట్టాలనా వద్దా?" గురుతు చేసినాడు చిన్నయ్య

"పెట్టకూడదు చిన్నయ్యా. పెట్టనే పెట్టకూడదు. అన్ని నుడులలో ఉన్నట్లే తెలుగులోనూ అలవు(ప్రామాణిక)నుడి, నెలవు(మాండలిక) నుడి ఉన్నాయి కదా. నెలవునుడిలో కూడా కుదురు(కులం)నుడి విడిగా ఉంటుంది కదా. అలాంటి ఒక కుదురునుడిలోనివే పై సదులు. పారు(బ్రాహ్మణు)ల నోళ్లలో మట్టుకే ఉండే నెలవునుడిని అలవునుడిగా మార్చేసినారు తెలివరులు. ఎవరు చేసినా తప్పుతప్పే. చదువుకొన్న పారులలో తప్ప మరొకరిలో ఈ సదులు వినబడవు. వాళ్లు కూడా రాసేటప్పుడు గూటాలను తగిలించి ముప్పయి నలబయిలను రాయడం ముమ్మాటికీ తప్పే. నెలవునుడిలో కతలూ కట్టురలూ రాసుకొనేటప్పుడు రాయవచ్చు కానీ, ఎసిదిని రాసేటపుడూ ఆకికల్లో అలవునుడిలో రాసేటపుడూ గూటాలను పెట్టకూడదు కాక పెట్టకూడదు. అలవునుడిలో ఒడ్లు, అడ్లు అని రాయకూడదు, వడ్లు అనే రాయాలి. సిన్న, సెంబు అని రాయకూడదు, చిన్న, చెంబు అనే రాయాలి. ఇక్కడ కూడా అంతే, ముప్పయి, నలుబయి, ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయి అనే రాయాలి. గూటాలతో రాయకూడదు" చెప్పినాను.

''బాగుందన్నయ్యా, తెలుగుమాటలకు గూటాలను తగిలించకూడదని తెలుసుకొన్నాం. ఏదయినా ఒక చేర్పును గురించి చెప్పన్నయ్యా" అన్నాడు నారాయణ.

"అన్నయ్యా, ఈయన ఎవరో, ముద్రణాలయం అనే పెరమాటకు అచ్చుగుడి అనే తెలుగుమాటను వాడినారు చూడు" అన్నాడు చిన్నయ్య.

"బాగానే ఉంది కానీ, గుడికి మారుగా ఏదయినా చేర్పును కలిపి పొందించి ఉంటే ఇంకా బాగుండేది. కార్యాలయాన్ని పనిగుడి అంటే బాగుంటుందా?" అన్నాడు నారాయణ.

"నువ్వన్నది నిక్కమే నారాయణా. చేర్పు అనేది, కుదురుకు అంటుకొనేదిగా కంటే కలసిపోయేదిగా ఉంటే మరింత చిన్నమాటలను పొందించవచ్చు. పైగా గుడి అంటూనే అందరికీ వేలుపు వెలసిన చోటుగా మట్టుకే తోస్తుంది. తెలుగులో 'ఇలు' అనే మాట ఉంది. 'ఇల్లు' అని ఈమాటకు తెల్లం. ఈమాటను నన్నయ కూడా వాడినారు. గుడి అంటే కూడా ఇల్లు అనే కదా తెల్లం. గుడికి తెన్నాటి(ఇప్పటి తమిళనాటి) తెలుగుమాట కోయిలు. కళింగ తెలుగులో కోవెల. కో అంటే వేలుపు. వేలుపు ఉండే ఇలు కాబట్టి కోయిలు అయింది. ఈ 'ఇలు' ను చేర్పుగా చేసుకొని కొత్తమాటలను పుట్టించవచ్చు" అంటూ మొదలిడినాను.

1. అగవు+ఇలు = అగవిలు ఆఫీస్.
(కార్యాలయం అంటున్నారు. అగవు అంటే పని)
2. అచ్చు+ఇలు = అచ్చిలు ప్రింటింగ్‌ప్రెస్.
(ముద్రణాలయం).
3. అడకు+ఇలు = అడకిలు బ్యాంక్.
(అడకు అంటే దాచి ఉంచి కావాలసినపుడు తిరిగితీసుకోవడం. తెన్నాటి తెలుగుమాట ఇది).
4. అరుగు+ఇలు = అరుగిలు ఆడిటోరియం.
(రంగమండపం అంటున్నారు).
5. ఉచ్చ+ఇలు = ఉచ్చిలు యూరినల్స్.
(మూత్రశాల అంటున్నారు. దాదాపు రెండువేల ఏళ్ల కిందట, ఇక్ష్వాకుదొరలు, నాగార్జునకొండ దగ్గర ఒక పలుచదువిలును నెలకొల్పినారు. అక్కడ యూరినల్స్‌కు 'ఉచ్చకుటి' అని రాతిపలకను చెక్కించి పెట్టినారు)
6. ఎరుక+ఇలు = ఎరుకిలు అకాడెమీ.
(ఎరుక అంటే జ్ఞానం)
7. ఎస+ఇలు = ఎసిలు/ఎసగిలు మ్యూజిక్ తియేటర్.
(ఎస అంటే సంగీతం. తెన్నాటి మాట)
8. కనబరుచు+ఇలు = కనబరపిలు ఎగ్జిబిషన్
(ప్రదర్శనశాల అంటున్నారు.).
9. కాల్చు+ఇలు = కాల్చిలు క్రిమెటోరియం.
10. కూడు+ఇలు = కూటిలు రెస్టారెంట్.
(బోజనశాల అంటున్నారు.)
11. కోగు+ఇలు = కోగిలు బార్బర్‌షాప్/సెలూన్.
(క్షౌరశాల అంటున్నారు. కోగు=గొరుగు.)
12. కోలు+ఇలు = కోలిలు పోలీస్‌స్టేషన్.
(రక్షకబట నిలయం అంటున్నారు. కోలు=కావలి; కోలుకారు=పోలీస్)
13. గూడు+ఇలు = గూటిలు డార్మెటరీ.
14. చదువు+ఇలు = చదువిలు కాలేజ్.
(కళాశాల అంటున్నారు)
15. చలిదాపు+ఇలు = చలిదాపిలు కోల్డ్‌స్టోరేజ్.
(శీతలగిడ్డంగి అంటున్నారు)
16. చలువ+ఇలు = చలువిలు లాండ్రీ.
17. తగవు+ఇలు = తగవిలు కోర్ట్.
(న్యాయస్తానం అంటున్నారు. తగువు = న్యాయం)
18. తమ్మ+ఇలు = తమ్మిలు పాన్‌బూత్.
19. తానేగి+ఇలు = తానేగిలు ఆటోస్టాండ్.
(తానేగి అంటే ఆటోరిక్షా)
20. తెరాట+ఇలు = తెరాటిలు సినిమా తియేటర్.
(చలనచిత్ర మందిరం అంటున్నారు)
21. తేనీరు+ఇలు = తేనీరిలు టీస్టాల్.
22. దంచు+ఇలు = దంపిలు ఫ్లోర్‌మిల్.
23. దొంతి+ఇలు = దొంతిలు అపార్ట్‌మెంట్.
24. నట్టువ+ఇలు = నట్టువిలు నాట్యమందిరం.
25. ననుపు+ఇలు = ననుపిలు ఫ్యాక్టరీ.
(కార్మాగారం అంటున్నారు. ననుపు=వృత్తి)
26. నారు+ఇలు = నర్సరీ.
27. నిలవ+ఇలు = నిలవిలు గోడౌన్.
(గోదాము అంటున్నారు.)
28. నోయి+ఇలు = నోయిలు లైబ్రరీ.
(గ్రందాలయం అంటున్నారు. నోయి=గ్రందం. ఇది తెన్నాటి తెలుగుమాట)
29. పట్టేగి+ఇలు = పట్టేగిలు రైల్వేస్టేషన్.

(ధూమశకట నిలయం అంటున్నారు. పట్టేగి=ట్రైన్)

30. పలుకు+ఇలు	=	పలుకిలు	టెలిఫోన్ బూత్.
31. పలుచదువు+ఇలు	=	పలుచదువిలు	యూనివర్సిటీ. (విశ్వవిద్యాలయం అంటున్నారు.)
32. పాలు+ఇలు	=	పాలిలు	మిల్క్‌బూత్.
33. పేరేగి+ఇలు	=	పేరేగిలు	బస్‌స్టేషన్.
34. మంట+ఇలు	=	మంటిలు	ఫైర్‌స్టేషన్. (అగ్నిమాపక కేంద్రం అంటున్నారు).
35. మనుము+ఇలు	=	మనుమిలు	జూ. (జంతుప్రదర్శనశాల అంటున్నారు. మనుము = జంతువు. తెన్నాటి తెలుగుమాట).
36. మరుగు+ఇలు	=	మరుగిలు	టాయ్‌లెట్. (శౌచాలయం అంటున్నారు)
37. మిను+ఇలు	=	మిన్నిలు	కరంటు ఆఫీస్. (విద్యుత్ కార్యాలయం అంటున్నారు)
38. వసతి+ఇలు	=	వసతిలు	హోటెల్/ లాడ్జ్. (విశ్రాంతి గృహం అంటున్నారు)
39. విరుగు+ఇలు	=	విరుగిలు	హాస్పిటల్. (వైద్యశాల అంటున్నారు. విరుగు = చికిత్స/ వైద్యం)
40. వేచు+ఇలు	=	వేచిలు	వెయిటింగ్ రూమ్
41. వేలిమి+ఇలు	=	వేలిమిలు	యజ్ఞశాల (వేలిమి=యజ్ఞం)
42. సంత+ఇలు	=	సంతిలు	షాపింగ్‌మాల్

6

''అన్నయ్యా, నువ్వేమో నన్ను అందరితో అణకువగా ఉండుమంటావు. తెలుగును ఎవరన్నా అలకువగా మాట్లాడితే అణచుకోవడం నావల్ల కావడం లేదు" అంటూ వచ్చినాడు చిన్నయ్య.

చిన్నయ్య గురించి తెలిసిందేగా! నవ్వుతూ "అణచుకొమ్మని చెప్పలేదు చిన్నయ్యా, గట్టిగానే ఎదురుకోవాలి. అయితే ఆ ఎదురుకోవడంలో దురుసుతనమూ వెక్కసమూ ఉండకూడదు, ఇంతకీ ఏమయింది?" అన్నాను.

"ఆఁ, ఎవడో గొట్టంగాడు, తెలుగుదేముంది, సంసుక్రుతపు కాలిగోటికి చాలదు మీ తెలుగు అన్నాడు. నాకు మండిపోయి చెడామడా కడిగిపారేసినాను" అన్నాడు.

"చూడు చిన్నయ్యా, మనచుట్టూ వేలమంది తెలివరులు, సంసుక్రుతం అనేది వేలుపునుడి అనీ అది మందినోటినుండి పుట్టినది కాదు అనీ నమ్ముతుంటారు. వాళ్లందరూ తెలిసో తెలియకో తెలుగును చిన్నచూపు చూస్తుంటారు. అలాంటి చదువులే చదివి వచ్చినారు వాళ్లంతా. అది తప్పు, అన్ని నుడులూ గొప్పవే అని చెపుతున్నవాళ్లం వదులలెక్కలో కుడా లేము. కాబట్టి మనం గట్టిగా ఎదురుకోవలసిందే. అంతేకాని దూకుడుగా కడిగిపారేయకూడదు. అది సరేకానీ, నువ్వు వస్తూ వస్తూ మంచి చేర్పును వెంట పెట్టుకొని వచ్చినావు తెలుసా" అన్నాను.

"చేర్పునేమిటి, నేను వెంటపెట్టుకొని రావడమేమిటి, నువ్వంటున్నది నాకేమీ ఎరుకపడడం లేదు అన్నయ్యా" చిన్నయ్య అన్నాడు.

"వస్తూ నువ్వు పలికిన పలుకుల్లో అణకువ, అలకువ అనే రెండుమాటలు ఉన్నాయి కదా. ఆ రెండింటిలో 'ఉవ' అనే చేర్పు ఉంది చూడు" చెప్పినాను.

"నాకు ఎంతో ఎలమి(సంతోషం)గా ఉందన్నయ్యా, నాకు తెలియకుండానే, నేను కూడా ఒక చేర్పును వాడినాను" అన్నాడు చిన్నయ్య.

''నువ్వే కాదు చిన్నయ్యా, తెలుగువాళ్లం అందరమూ వాడుతున్నవాటినే, మనం విడదీసి విడమరచి చెపుతున్నాం. నమ్రత, అపక్వం, న్యూనత, సంకోచం, కోపం, నివాసస్తలం, స్తిరత్వం, ప్రయత్నం, జ్ఞానం, ఇవన్నీ సంసుక్రుపు మాటలు. పేరనికలు(నామవాచకాలు). వీటికి తెలుగుమాటలు లేవా అంటే ఉన్నాయి. అణకువ, అఱుకువ, అలకువ, అళుకువ, అలుకువ, ఉనుకువ, ఉంకువ, ఊకువ, ఎఱుకువలు వరనగా–ఆ తెలుగుమాటలు. ఇవన్నీ తెలుగు నుడిగంటులలో ఉన్నవే. బడిపొత్తాలలో, ఆకికలలో తెలుగుమాటలు కాక పెరమాటలనే వాడడం వలన తెలుగు నెన్నొడి మరుగున పడిపోయింది. ఉన్న నెన్నొడిని వాడడం లేదు. కొత్త నెన్నొడిని పుట్టించుకోవడం లేదు. ఇక తెలుగు ఎలా ఎదుగుతుంది? పై తొమ్మిది మాటలలోనూ 'ఉవ' అనే చేర్పుఉంది. ఈ చేర్పును అగవనిక(క్రియావాచకా)లకు చేర్చితే పై పేరనికలు ఏర్పడినాయి. అణగు, అఱుగు, అలగు, అళుకు, అలుగు, ఉనుకు, ఉంకు, ఊకు, ఎఱుగు అనేవి ఆ అగవనికలు. ఇటువంటి అగవనికలను ఏరుకొని, వాటికి 'ఉవ'ను చేర్చితే కొత్తమాటలు పుడుతాయి. మచ్చుకు కొన్నిటిని పుట్టిదాం పట్టు" అని మొదలుపెట్టినాను.

1. అంకు+ఉవ	అంకువ	లాబం	అంకు=లబించు.
2. అగు+ఉవ	అకువ	ప్రాప్తం	అగు=ప్రాప్తించు.
3. అడకు+ఉవ	అడకువ	గోప్యత	అడకు=దాచు.
4. అడుకు+ఉవ	అడుకువ	శ్రేణి	అడుకు=పేర్చు.
5. అదుకు+ఉవ	అదుకువ	ఏకాగ్రత	అదుకు=లగ్నంచేయు.
6. అనగు+ఉవ	అనకువ	సంపర్కం	అనగు=కలయు.
7. అరుగు+ఉవ	అరుకువ	ప్రయాణం	అరుగు=వెడలు.
8. అవుకు+ఉవ	అవుకువ	సంకోచం	అవుకు=వెనుదీయు.
9. ఆగు+ఉవ	ఆకువ	విరమణ	ఆగు=విరమించు.
10. ఇంకు+ఉవ	ఇంకువ	నష్టం	ఇంకు=నష్టపోవు.
11. ఇగ్గు+ఉవ	ఇక్కువ	ఉద్వాసన	ఇగ్గు=ఉద్వాసనచేయు.
12. ఇదుగు+ఉవ	ఇదుకువ	వికాసం	ఇదుగు=వికసించు.
13. ఇనుకు+ఉవ	ఇనుకువ	శుష్కం	ఇనుకు=శుష్కించు.
14. ఇరుగు+ఉవ	ఇరుకువ	అంతర్భూతం	ఇరుగు=ఇముడు.
15. ఇలుగు+ఉవ	ఇలుకువ	మరణం	ఇలుగు=మరణించు.
16. ఈగు+ఉవ	ఈకువ	ప్రవేశం	ఈగు= ప్రవేశించు.
17. ఉడుగు+ఉవ	ఉడుకువ	త్యాగం	ఉడుగు=త్యజించు.
18. ఉతుకు+ఉవ	ఉతుకువ	తాడనం	ఉతుకు=బాదు.
19. ఉదుకు+ఉవ	ఉదుకువ	నాశనం	ఉదుకు=నశింపచేయు.
20. ఉబుకు+ఉవ	ఉబుకువ	సంతోషం	ఉబుకు=సంతోషించు.
21. ఉరుకు+ఉవ	ఉరుకువ	లంగనం	ఉరుకు=లంగించు.

శ్రద్ధాంజలి

శ్రీ గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి కనుమరుగు



బళ్ళారి ప్రాంత తెలుగు సాహిత్యాభిమానులకు అత్యంత అప్పుడు, ఆత్మీయుడు, సన్నిహిత స్నేహ బాంధువుడు, తెలుగు సాహితీసింధువు, తెలుగు కన్నడ భాషాసాహిత్యాల సేతువు – శ్రీ గుత్తి (జోళదరాశి)చంద్రశేఖరరెడ్డి గారు. 'దేశభాషలందు తెలుగులెస్స' అని చాటి చెప్పిన, శ్రీకృష్ణదేవరాయలనినా, రాయలవారు అభిమానించిన తెలుగుభాష అనినా, చంద్రశేఖరరెడ్డిగారికి ఎనలేని అభిమానం. చంద్రశేఖరరెడ్డిగారు పుట్టింది, బళ్ళారికి దగ్గరలోనే ఉన్న జోళదరాశి అనే ఊరిలో. తండ్రి నారాయణరెడ్డిగారు కూడా తెలుగు అభిమాని. తండ్రినుంచి తెలుగు అభిమానాన్ని, తెలుగు ఆవేశాన్ని పుణికి పుచ్చుకున్న తనయుడు రెడ్డిగారు.

బళ్ళారిలో ఎల్లప్పుడూ తెలుగు కనిపిస్తూ వినిపిస్తూ ఉండాలి. బళ్ళారి తెలుగు కనుమరుగు కాకూడదు, అని ఎప్పుడూ ఆరాటపడుతుండేవారు రెడ్డిగారు. బళ్ళారిలోనూ కర్నాటకలోనూ తెలుగు రెండవ అధికార భాషగా గుర్తింపు పొందాలని, అందుకు తెలుగు కన్నడ ప్రభుత్వాలు రెండూ పూనుకోవాలని, తను పాలుపంచుకున్న వేదికలమీదంతా ఘోషించేవారు వీరు.

బళ్ళారిలోని రాఘవ స్మారక సమితి, ఆంధ్రకళాసమితి, బళ్ళారి కల్చరల్ అసోసియేషన్, తెలుగు సంస్కృత సమితి మొదలైన సంస్థలలో సన్నిహిత సంబంధాలను చివరివరకూ కొనసాగించారు. తండ్రిగారి పేరుతో 'గుత్తి నారాయణరెడ్డి స్మారక పురస్కారం'ను ఏర్పాటు చేసి, ప్రతి ఏడాదీ, తెలుగురాష్ట్రాలకు బయట ఉండి తెలుగుకు సేవ చేస్తున్న వారిని గుర్తించి, జోళదరాశికి పిలిపించి, పురస్కారంతో గౌరవించేవారు.

హైదరాబాద్‌లో కుదురుకొన్నా, ఆయన మనసు ఎల్లప్పుడూ బళ్ళారి చుట్టూ తిరుగుతుండేది. ఆరోగ్యం సహకరించకపోయినా చివరిదినాలలో ఆయన బళ్ళారికి వచ్చారు. అఖండ బళ్ళారి జిల్లా పోరాట ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాళ్లు సహకరించకపోయినా వేదికలెక్కారు. గొంతు సహకరించకపోయినా చైతన్యాన్ని రగులుకొల్పే ఉపన్యాసాలనిచ్చారు. చివరిరోజన కొనవూపిరిదాకా బళ్ళారి తెలుగు గురించి కలవరిస్తూ, తెలుగు పలుకులను పలుకుతూ కనుమూశారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా, చారిత్రక పరిశోధకుడిగా, అనువాద రచయితగా, నటుడిగా తెలుగన్నడ భాషాసాహిత్యాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయాలు.

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ, మా కన్నడాంబకు మంగళారతులు' అంటూ ఉపన్యాసాన్ని మొదలుపెట్టే చంద్రశేఖరరెడ్డిగారి గొంతు, బళ్ళారిలో,కర్ణాటకలో, తెలుగువాళ్లు ఉన్నంతకాలమూ వినిపిస్తూనే ఉంటుంది. తెలుగును వదలిపెట్టవద్దని మా వెంటపడుతూనే ఉంటుంది.

కె.సురేంద్రబాబు,
విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు, బళ్ళారి

22. ఉఱుకు+ఉవ	ఉఱుకువ	ఉద్గారం	ఉఱుకు=ఉద్గతమగు.
23. ఉలుకు+ఉవ	ఉలుకువ	అసూయ	ఉలుకు=అసూయపడు.
24. ఉసుగు+ఉవ	ఉసుకువ	సంగర్షణ	ఉసుగు=నలుగు.
25. ఎదుగు+ఉవ	ఎదుకువ	అభ్యుదయం.	
26. ఎమకు+ఉవ	ఎమకువ	శోదన	ఎమకు=శోదించు.
27. ఎఱగు+ఉవ	ఎఱకువ	నమస్కారం	ఎఱగు=నమస్కరించు.
28. ఎసగు+ఉవ	ఎసకువ	విజృంబణం	ఎసగు=విజృంబించు.
29. ఏకు+ఉవ	ఏకువ	శాపం	ఏకు=తిట్టు.
30. ఒగ్గు+ఉవ	ఒక్కువ	వ్యాప్తి	ఒగ్గు=వ్యాపించు.
31. ఒడుకు+ఉవ	ఒడుకువ	హాజరు	ఒడుకు=ప్రవేశపెట్టు.
32. ఒదుగు+ఉవ	ఒదుకువ	విదేయత	ఒదుగు=విదేయుడగు.
33. ఒరగు+ఉవ	ఒరకువ	శిదిలం	ఒరగు=శిదిలమగు.
34. ఒలుకు+ఉవ	ఒలుకువ	స్రావం	ఒలుకు=స్రవించు.
35. ఒసగు+ఉవ	ఒసకువ	అంకితం	ఒసగు=అర్పించు.

"ఉవతో నూర్లమాటలను పుట్టించవచ్చు. అయితే అగవనికలకు మట్టుకే ఉవను చేర్చాలా అనే అరగలి వస్తుంది. పై మాటలన్నీ అగవనికలే కదా. పేరనికలకు కూడా ఉవను చేర్చవచ్చు అనడానికి కొన్ని మచ్చులు కనబడుతున్నాయి. వేగు+ఉవ = వేకువ; పెక్కు+ఉవ= పెక్కువ ; టెక్కు+ఉవ = టెక్కువ వంటివి. ఒక మచ్చు దొరికినా మనం అల్లుకుపోవాలి. చిక్కు+ఉవ= చిక్కువ = క్లిష్టం; ముక్కు + ఉవ = ముక్కువ = అనునాసికం వంటి మరిన్ని మాటలను పుట్టించవచ్చు ఈ ఉవతో" అని ముగించినాను.

(తరువాయి వచ్చే సంచికలో...)

తెలుగువారందరూ తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి. 'కలగాలి' అంటే రెండు అర్థాలు: ఒకటి, తెలుగులో జరుపుకోవాలి అని ఎవరూ శాసించకుండానే, స్వచ్ఛందంగా ప్రజలు అనుకొని జరుపుకోవడం. రెండు, అందుకు తగ్గ పరిస్థితులు, సదుపాయాలు మనకు మనం కల్పించుకోవడం.

స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

7

"**అ**న్నయ్యా, పిండిని రుబ్బే గ్రైండర్‌ను రుబ్బురోలు అని పిలుచుకోవచ్చుగా. మనకు ఉన్న తెలుగుమాటలకు మారుగా కొత్త మాటలను పుట్టించడం ఎందుకు?" అన్నాడు చిన్నయ్య.

"రుబ్బురోలును చేత్తో తిప్పుతాం. గ్రైండరును మించు(విద్యుత్)తో తిప్పుతాం. అవి చేసే పనులు ఒకటే కావచ్చు కానీ, వాటి అడపొడ (ఆకారం)వేరువేరు. కాబట్టి గ్రైండర్‌కు కొత్తమాటను పుట్టించితేనే బాగుంటుంది. కదూ అన్నయ్యా" చెప్పినాడు నారాయణ.

"అలాగయితే మన పాత తెలుగుపేర్లన్నీ పోయినట్లేగా. ఆ పేర్లతోపాటు ఆపేర్లకు చెందిన పనిపలుకులూ పోయినట్లేగా. రుబ్బురోలు అనే మాటను వాడడం చిన్నతనం అయిపోయి, గ్రైండర్ అనే మాటను వాడుతున్నాం. రుబ్బురోలుతోపాటు రుబ్బడం అనే పనిపలుకూ పోయింది. గ్రైండ్ చేయడం అనేది వాడుకయింది. మిక్స్ చేయడం, వాష్ చేయడం, కుక్ చేయడం, కట్ చేయడం....వంటివి కోకొల్లలుగా వచ్చేసినాయి. పనిపలుకులు పోవడం నుడికి పెనుముప్పని నువ్వే అంటుంటావుగా అన్నయ్యా" అంటూ అంగలార్చినాడు చిన్నయ్య. ఇక నేను కలిపించుకోక తప్పలేదు.

"చిన్నయ్యా, నీ అలమట నాకు ఎరుకపడింది. నువ్వు కాస్త గందరగోళంలో ఉన్నావు. రుబ్బురోలు, గ్రైండర్ మట్టుకే కాదు. ఎన్నో ఉరువు(వస్తువు)లు వాటి అడపొడను మార్చుకొని కొంగొత్త జాడలతో మనముందుకు వచ్చినాయి, వస్తున్నాయి కూడా. నారాయణ చెప్పినట్లు కొత్త అడపొడకు పాతపేరును మనవాళ్లు ఒప్పుకోరు. అలా పుట్టించినపుడే, వాటికి చెందిన పనిపలుకులు కూడా మనగలుగుతాయి. కొత్తమాటలు రాకపోతే పాతమాటలను వాడడానికి ఇచ్చగించక పెరనుడి మాటలనే తీసుకొని వాడేస్తారు. కాబట్టే కొంగొత్త ఉరువులకు కొత్తమాటలు కానే కావాలి" అన్నాను.

"ఎన్ని కొత్త ఉరువులు వచ్చినా కొత్తమాటల్ని పుట్టించగలమా?" అడిగినాడు చిన్నయ్య.

"అలా పుట్టించగలిగేదే కదా చేవయిన నుడి. ఇన్నాళ్లూ అన్నయ్య దగ్గరుండి నువ్వు నేర్చుకొన్నది ఇంతేనా. అన్నయ్య తలచుకొంటే వేలమాటలను పుట్టించగలడు" అన్నాడు నారాయణ.

చాలు నారాయణా, నీ పొగడ్తలను ఆపు. నన్ను పొగడడం అంటే, నాకాళ్లకింద గోతిని తీయడమే. వేలమాటలను నేనే కాదు, నువ్వయినా చిన్నయ్యయినా ఇంకెవరయినా కూడా పుట్టించవచ్చు. అది మన తెలుగుకున్న చేవ. మీకొక మందలను చెపుతాను వినండి. తెలంగాణలోని బోదన్‌లో పూదోట శౌరీలు అనే పంతులమ్మ ఉన్నారు. ఆడపిల్లల బడి అది. కొత్తమాటల పుట్టింపు ఎలా అనేది నేను చెపుతుంటే విని, ఎనిమిదవ తరగతి పిల్లలతో ముచ్చటించింది. తొలినాడు ఒక చేర్పును గురించి చెప్పి, ఒకటి రెండు మాటలను పుట్టించి చూపించింది. 'మీరు కూడా ఈ చేర్పుతో కొత్తమాటలను పుట్టించండి చూద్దాం' అని పిల్లలతో అనింది. అంతే ఆ అరగంట తరగతంతా నవ్వులతో తెలుగుమాటలతో నిండిపోయింది. పన్నెండు పదమూడేళ్ల ఈడున్న ఆ పిల్లలు అరగంటలో ఏభైకి పైగా మాటలను పుట్టించినారు. రెండవనాడు ఇంకొక చేర్పును చెప్పమని శౌరీలమ్మని బతిమాలుకొన్నారు. ఆ రెండో చేర్పుతో కూడా పదులమాటలను పుట్టించినారు. ఆ పంతులమ్మ ఎలమికి ఎల్లలు లేకుండా పోయాయి. పసిపిల్లలు కూడా మాటలు పుట్టించగలిగినంత తేలికయిన నుడి తెలుగు. త్వచకుద్యము, తరంగదైర్ఘ్యము, స్వపరాగ సంపర్కము, పరపరాగ సంపర్కము, అనులోమానుపాతము, క్వార్ధము, విశేషణోత్తరపద కర్మధారయ సమాసము, జస్త్వసంధి, శ్చుత్వ సంధి, క్షితిజరేక, పత్రహరితము, ద్విచక్రవాహనము, ప్రయాణప్రాంగణము, ప్రాఙ్నన్నయ యుగము, ఊర్ధ్వకోణము, స్నిగ్ధతాగుణకము, ఆధునికానంతర కవిత్వము, విస్తృత ఆవర్తన పట్టిక, కాంతి పరావర్తనము, విహంగవీక్షణము... వంటి నూర్లవేల పెరమాటలను దింపుకొని, వాటినే తెలుగనుకొని, వాపునే బలువనుకొని మురిసిపోతున్నాం. ఈ పోకడను వదిలించుకొంటే కానీ మన నుడి ఎదగదు" అన్నాను.

చిన్నయ్యా నారాయణా కాసేపు ఏమీ మాట్లాడలేదు. పిమ్మట చిన్నయ్య పెదవివిప్పి, "నువ్వు కలతపడవద్దు అన్నయ్యా, ఇప్పటికి మనం ఉన్నాముగా, ముందుముందు ఇంకా కొందరు ఈ పనికి పూనుకొంటారులే" అన్నాడు.

"అది సరే అన్నయ్యా, బోదన్ బడిలో శౌరీలమ్మ పిల్లలకు చెప్పిన చేర్పులు ఏమిటో చెప్పవా" అడిగినాడు నారాయణ.

"చెపుతాను నారాయణా, వాటిలో మొదటిది 'ఎన'. కొత్త ఉరువులకు కొత్తపేర్లను పుట్టించడానికి ఈ 'ఎన' అనే చేర్పు బాగా ఒదుగుతుంది. ఇది కూడా మన తెలుగు నుడిగంటులలో కనిపించదు. అరవ నుడిగంటులలో 'ఇనం' అనేమాట కనబడుతుంది. దీని తెల్లం 'జాతి' లేదా 'రేస్'. తెన్నాటి తెలుగువాళ్లు దీనిని 'ఎనం' అని వాడుతారు. దానికీ మన 'ఎన'కూ పొత్తు ఉంది. 'వస్తువు' అనేది సంసుక్రుతపు మాట. ఉరువు అనేది కూడా సంసుక్రుత రూపం నుండి తెలుగు అయిందే. మరి దీనికి తెలుగుమాట లేదా అంటే, అదే ఈ 'ఎన'. తెలుగు నుడిగంటులలో లేకపోవచ్చు కానీ తెలుగువాళ్ల నోళ్లలో మట్టుకు బాగా ఉంది ఇది. దువ్వడానికి వాడే ఎన, దువ్వు+ఎన=దువ్వెన; ఈర్చడానికి వాడే ఎన, ఈర్చు+ఎన=ఈర్పెన; రెండు వంతులను కలిపే ఎన, వంతు+ఎన=

వంతెన; బండి ఇరుసూ గానులూ మెత్తగిల్లడానికి అంటే కందడానికి వాడే ఎన, కందు+ఎన=కందెన; ఇవి కొన్ని మచ్చులు. వెతుక్కొంటే మరిన్ని మాటలు దొరుకుతాయి. ఎనతో ఎన్నలేనన్ని మాటలను పుట్టించవచ్చు. మచ్చుకు కొన్నిటిని పుట్టిద్దాం'' అంటూ మొదలుపెట్టినాను.

1. అరుచు+ఎన   అరపెన   లౌడ్‌స్పీకర్   ....
2. ఆర్చు+ఎన   ఆర్పెన   డ్రైయర్   ....
3. ఈద+అదుపు+ఎన   ఈదదుపెన   ఏ.సి.   ఈద=గాలి.
4. ఉజ్జు+ఎన   ఉజ్జెన   మాబ్   ఉజ్జు=తుడుచు.
5. ఉతుకు+ఎన   ఉతుకెన   వాషింగ్‌మెషిన్   .....
6. ఉలివు+ఎన   ఉలివెన   సౌండ్‌బాక్స్   ఉలివు=సౌండ్.
7. ఎంచు+ఎన   ఎంపెన   కాలిక్యులేటర్   ....
8. ఎత్తు+ఎన   ఎత్తెన   లిఫ్ట్   ....
9. ఎనిక+ఎన   ఎనికెన   కంప్యూటర్

ఎనిక=లెక్క. సంగణక యంత్రం అంటున్నారు.

10. ఒత్తు+ఎన   ఒత్తెన   ఐరన్‌బాక్స్   .....
11. ఒరయు+ఎన   ఒరయెన   టెస్టర్   ఒరయు=టెస్ట్‌చేయు
12. కడుగు+ఎన   కడుగెన   వాషర్   ....
13. కలుపు+ఎన   కలుపెన   మిక్సర్   ....
14. కాచు+ఎన   కాపెన   గీజర్   ....
15. కుందు+ఎన   కుందెన   కుర్సీ/చెయిర్

కుందు=కూర్చొను
వీల్ చెయిర్=గానుకుందెన
ఈజీ చెయిర్=వాలుకుందెన
చెయిర్ పర్సన్=కుందెనరి.

16. కుమ్ము+ఎన   కుమ్మెన   ఒవెన్

కుమ్ము=వేడి నిప్పులు;
కుంపటి=వేడినిచ్చేది;
కుమ్మెన=వేడిచేయడానికి వాడేది

17. కోయు+ఎన   కోతెన   హార్వెస్టర్   ....
18. గొరుగు+ఎన   గొరుగెన   రేజర్   ....
19. చలవ+ఎన   చలవెన   కూలర్   ....
20. చివ్వు+ఎన   చివ్వెన   పీలర్   ....
21. తుడుపు+ఎన   తుడుపెన   ఎరేజర్   ....
22. తురుము+ఎన   తురుమెన   గ్రేటర్   ....
23. తెంచు+ఎన   తెంపెన   కట్టర్   ....
24. (తొల)చూపు+ఎన   (తొల)చూపెన   టెలివిజన్

తొల=దూరం; తొలగు=దూరమగు;

తొలగా ఉన్నవాటిని చూపునది తొలచూపెన. చిన్నదిగా చూపెన అని పిలుచుకోవచ్చు. దూరదర్శన్ అంటున్నారు.

25. దంచు+ఎన   దంపెన   మిక్సీ   ....
26. దుమ్ము+ఎన   దుమ్మెన   డస్టర్

దుమ్మును దులిపేది

27. దొరల్చు+ఎన   దొరల్పెన   కన్వర్టర్   ....
28. నింపు+ఎన   నింపెన   ఫిల్లర్   ....
29. పలుకు+ఎన   పలుకెన   ఫోన్

టెలిఫోన్‌కు దూరవాణి అని వాడుతున్నారు. ల్యాండ్‌ఫోన్‌కు స్థిరవాణి అని, మొబైల్‌ఫోన్‌కు చరవాణి అనీ వాడుతున్నారు. ఫోన్‌కు, ఎనను చేర్చకుండా 'పలుకి' అనడం తెన్నాటి తెలుగువాళ్ల వాడకం. నేలపలుకి, అలపలుకి అనేవి కూడా. 'ఫోన్ చేసినారా' అనడాన్ని 'పిలిస్తిరా' అనడం, మిస్డ్‌కాల్‌ను 'దూసుపిలుపు' అనడం, తెన్నాటి తెలుగు వాడకం.

30. పొదువు+ఎన   పొదువెన   రికార్డర్

పొదువుకొనేది.

31. పొల్లు+ఎన   పొల్లెన   సూయింగ్‌మెషీన్

పొల్లు = కుట్టు. కుట్టెన అనికూడా వాడవచ్చు.

32. పోజు+ఎన   పోజెన   ప్యూరిఫైయర్

పోజు= శుభ్ర పరచు.

33. మరతిప్పు+ఎన   మరతిప్పెన   స్క్రూడ్రైవర్   ....
34. మార్చు+ఎన   మార్పెన   ట్రాన్స్‌ఫార్మర్

నియంత్రిక అని వాడుతున్నారు.

35. రుద్దు+ఎన   రుద్దెన   స్క్రబ్బర్   .....
36. రుబ్బు+ఎన   రుబ్బెన   గ్రైండర్   ....
37. వండు+ఎన   వండెన   కుక్కర్   ....
38. వడ+ఎన   వడెన   ఫ్రిజ్

వడ=గట్టకట్టిన మంచు

39. విత్తు+ఎన   విత్తెన   సీడర్   .....
40. వీయు+ఎన   వీవెన   ఫ్యాన్   .....
41. వెచ్చ+ఎన   వెచ్చెన   హీటర్   .....
42. వెలచు+ఎన   వెలపెన   ఫిల్టర్

వెలచు=వడకట్టు

"ఇట్లా ఎన్నో మాటలను పుట్టించవచ్చు. చిక్కుతీసే ఎన ఉంటే చిక్కెన. కలుపుదోకే ఎన దోకెన. చెక్కేది చెక్కెన. తిరిగేది తిరుగెన. చుట్టేది చుట్టెన. పిండేది పిండెన. నొక్కేది నొక్కెన. ఒలిచేది ఒలుపెన. కొలిచేది కొలుపెన. వేల ఉరువులు కొంగొత్తవి వచ్చినా ఈ ఎనతో వాటికి తెలుగుపేర్లను పెట్టవచ్చు. తెలుగు చేవగల నుడి. దానిని వాడుకొనే చేవ తెలిసుండాలి అంతే" అంటూ ముగించినాను.

8

"అన్నయ్యా, బోదన్ శౌరీలమ్మ, పిల్లలకు నేర్పిన రెండో చేర్పును గురించి చెప్పవా" అడిగినాడు చిన్నయ్య.

"నాకొక అరగలి(సందేహం) అన్నయ్యా,బోదన్ అనే పేరు

వినడానికి వింతగా ఉంటుంది కదా. బహుదాన్యపురం, పౌదన్యపురం అని చెక్కింపు(శాసనా)లలో ఉందట. ఈ సంసుక్రతపు పేర్లు కాకుండా, దానికి తెలుగుకుదురు ఏదయినా ఉంటుందంటావా?" నడుమన దూరుతూ అడిగినాడు నారాయణ.

"తెలుసుకోవలసిన అడకనే అడిగినావు కానీ, దీనిని విడమరచి చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. అయినా కుదింపుగా చెపుతాను విను. బారతనాడులో తొలిమినుకు(రుగ్వేదం) వెలువడిన నాటికే పలునుడులు ఉనికిలో ఉన్నాయి. తెనుగు(మూలద్రావిడం) వాటిలో ఒకటి. తొలిమినుకు మీద తెనుగు వెలుగులు పడిన ఆనవాళ్లు ఉన్నాయి. తెనుగు ఆనాటికే నాగరికనుడి. హరప్పావంటి పేటలను కట్టుకొన్న నుడి. ఎంతో ఎడంగా ఉన్న గ్రీకు, సుమేరియన్లతో కవరం (వ్యాపారం) సాగించిన నుడి. కవరం కోసం కడళ్లనే దాటిన నుడి. అంతగా ఎదిగి ఉన్నది కాబట్టే తొలిమినుకు మీదనే దీని వెలుగు పడింది. తొలిమినుకులో ఉన్న నుడి పేరు వైదికం లేదా చాందసం. చాలామంది పొరపాటుగా దానిని సంసుక్రుతం అనేస్తుంటారు. చాందసం,తెనుగు వంటి ఒకటిరెండు నుడుల కలయికతో తావుతావుకూ కొంగొత్త గొంతులు వెలువడినాయి. వీటిని ప్రాక్రుతాలు అన్నారు. ప్రాక్రుతాలన్నిటికీ పెనునుడి ఒకటి కావలసి వచ్చింది. అందుకనే అప్పటి తెలివరులు, చాందసనుడిని ఆనుగా చేసికొని, తెనుగునుండి ఎన్నో మాటలను కలుపుకొని సంసుక్రుతాన్ని కట్టినారు. సంస్కరించి కట్టిననుడి కాబట్టే దానికి సంసుక్రుతం అనే పేరు వచ్చింది. కడలినీ కప్పళ్లనీ ఎరుగని చాందసనుడికీ, తెనుగునుండి ఎన్నో మాటలను కలుపుకొన్న సంసుక్రుతానికీ ఎంతో వేరిమి ఉంది. తెనుగునుండి తెలుగు విడివడినాకనే సంసుక్రుతపు కట్టుబాటు జరిగింది. అందుకే తెలుగు ఆనవాళ్లు సంసుక్రుతంలో చాలా కనిపిస్తాయి. తరిపోకడలో తెలుగుమీద చీకటికమ్ముకొని, అన్ని మాటలూ సంసుక్రుతం నుండే పుట్టినాయి అనే అనిపింపు గట్టిపడిపోయింది. అటువంటి మాటలలో పోత,ఓడ, దోనె వంటివి ఉన్నాయి. ఇవన్నీ తెలుగునుండి వెళ్లినవి. కానీ మన నుడిగంటులలో మట్టుకు దిగుమతి అయినవిగా కనబడుతాయి. 'పోత' పుట్టుక గురించి అమరకోశంలో ఏ విడమరపూ లేదు. పోత తెలుగుమాట. దీనికి ముందు రూపు 'పొంత'. 'పొన్' అనే తెలుగుకుదురుకు కలయిక అని తెల్లం. పొందు,పొత్తు,పొంతకుండ,పొంగలి వంటి మాటలలో ఇది కనబడుతుంది. కొయ్యాకొయ్యా కలిసి ఏర్పడేది పొంత. దాని మరుపాడే పోత. పోతల మీద ఏరులను గడచి కడలిని చేరి ఓడలమీద దవ్వులకు చేరేవారు. ఓడలలో కప్పళ్లలో తెచ్చిన సరకును, పోతలమీదా పడవలమీదా లోతట్టుకు సాగించి కవరం చేసేవారు తెలుగువాళ్లు. అట్ల కవరం జరిగిన చోట్ల పేటలు ఏర్పడినాయి. వాటిపేర్లు కొన్ని 'పోత' తో మొదలయినాయి. పోతులూరు, పొందూరు, పోతనూరు, పొద్దటూరు, వంటివి అవి. బోదన కూడా అటువంటిదే. బట్టిప్రోలు చెక్కింపులో కూడా 'పోత' అనేపేరు తగులుతుంది. బోర్లించిన పోత అడపొడలో కొన్ని గుడుల పైకప్పులను కట్టుకొన్నాడు తెలుగువారు. ఇది తెలియక ఇప్పటి తెలివరులు వీటిని 'గజపృష్టం' అంటున్నారు. ఎంతో పాతదైన 'కపోత ఈశ్వర' గుడిపేరులో కూడా పోత ఉంది. ఇటువంటి తెలుగు మాటలు నూర్లు వేలు మరుగున పడిపోయినాయి. ఈనాటికి, తెలుగువాళ్లకు ఏమీ చేతకాదు అని ఇరుగుపొరుగు వారు చాటుతుంటే, అవును అది నిక్కమే అని మనం తలలూపుతున్నాం" అంటూ నారాయణ అడకకు మారాడినాను.

"అన్నయ్యా, ఆ రెండో చేర్పును చెప్పన్నయ్యా" బతిమిలాడినాడు చిన్నయ్య.

"చెపుతున్నా, ఆ చేర్పు 'ఏగి'. తెన్నాడులోని చోళనాడు తావున తెలుగువారు ఇప్పటికీ వాడుతున్న మాట ఇది. చోళనాడు తెలుగులో వాహనాన్ని 'ఏగి' అంటారు. 'ఏగు' అనే పనిపలుకు అన్నిచోట్లా వాడుకలో ఉన్నదే కదా. 'ఏగు' అంటే వెడలు, కదలు అని తెల్లం. ఏగేది ఏగి అయి ఉంటుంది. ఈ మాటను చేర్పుగా చేసికొని మనం కొత్త మాటలను పుట్టించవచ్చు. చూద్దాం రండి"

1. అద్దె+ఏగి	అద్దేగి	టాక్సీ	....
2. కోయు+ఏగి	కోతేగి	హార్వెస్టర్	....
3. చదును+ఏగి	చదునేగి	రోడ్‌రోలర్	....
4. జల్ల+ఏగి	జల్లేగి	ట్రక్‌వెహికల్	....
5. తవ్వు+ఏగి	తవ్వేగి	ప్రొక్లెయినర్	....
6. తాను+ఏగి	తానేగి	ఆటోరిక్షా	
		తానుగా ఏగేది. ఆటో=తనకుతాను	
7. తూను+ఏగి	తూనేగి	హెలీకాప్టర్	
	తూను=సాగు, ఎగురు; తూనీగ= ఎగిరేఈగ		
8. తేరు+ఏగి	తేరేగి	కార్	
	కార్ అనేమాట చారియట్ నుండి పుట్టింది. చారియట్ అంటే తేరు. తేరు వంటి ఏగి తేరేగి.		
9. తొట్టి+ఏగి	తొట్టేగి	టాంకర్	....
10. తోయు+ఏగి	తోయేగి	డోజర్	....
11. దుక్కి+ఏగి	దుక్కేగి	ట్రాక్టర్	
		ట్రాక్=చాలు; దుక్కి=నాగటిచాలు	
12. నీరు+అడుగు+ఏగి	నీరడుగేగి	సబ్‌మెరైన్	
		జలాంతర్గామి అంటున్నారు	
13. నొగులు+ఏగి	నొగులేగి	అంబులెన్స్	
		నొగులు=డిసీజ్	
14. పట్టె+ఏగి	పట్టేగి	ట్రైన్	
		పట్టెలమీద వెళ్లేది	
15. పాడె+ఏగి	పాడేగి	....	
		శవయాత్ర వాహనం అంటున్నారు	
16. పేరు+ఏగి	పేరేగి	బస్	బస్ అనే

మాట ఆమ్నీబస్ నుండి పుట్టింది. మందిని తీసుకొని వెళ్లేది అని తెల్లం. పేరు అంటే మందికి మరోమాట. ఎర్రాప్రెగడ ఈ మాటను వాడినారు. పేరును తీసుకొని వెళ్లేది.

17. పోరు+ఏగి	పోరేగి	వార్‌టాంకర్	....
18. మంట+ఏగి	మంటేగి	ఫైరింజన్ అగ్నిమాపక వాహనం అంటున్నారు.	
19. మిన్ను+ఏగి	మిన్నేగి	రాకెట్ మిన్నుకు ఏగేది	
20. సరకు+ఏగి	సరకేగి	లారీ	....

"తమ్ముళ్లూ, పైన ఎన, ఏగి చేర్పులతో ఇచ్చిన మాటలలో కొన్ని నేను పుట్టించినవి కావు. బోదన్ బడిపిల్లలు పుట్టించినవి. ఆ పిల్లల పేర్లు నాకు తెలియదు. పిల్లలకూ వాళ్ల పంతులమ్మ అయిన శౌరీలమ్మకూ మనమందరమూ మప్పిదాలను చెప్పాలి" అన్నాను.

"మంచిమాట చెప్పినావు అన్నయ్యా. మరి శౌరీలమ్మ అప్పుడే ఈ మాటలను బయటపెట్టి ఉండవచ్చు కదా" అన్నాడు నారాయణ.

"శౌరీలమ్మ వాటిని బయటపెట్టాలనే అనుకొనింది. అప్పుడు కొన్ని నెలలపాటు నడుస్తున్నచరిత్ర రాలేదు. అమ్మనుడి ఇంకా అప్పటకి మొదలుకాలేదు. అందుకని తెలుగుకోసం నడుముకట్టుకొన్న తెలుగువెలుగు అనే నెలాకిక(మాసపత్రిక)కు పంపింది. అందులో అచ్చుయినాయి". చెప్పినాను.

"నిక్కంగానే తెలుగు కోసం నడుము కట్టుకొన్న ఆకిక కదా అది" అన్నాడు చిన్నయ్య.

"కావచ్చు, ఆ నెలాకిక వాళ్లదే ఒక నాడాకిక(దినపత్రిక) కూడా ఉంది. అందులో ఒకసారి ఎలెక్ట్రిసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌కు నియంత్రిక అనే పేరును పుట్టించి వాడినారు. దానిని చదివి పారుపల్లి కోదండరామయ్య అనే ఆయన నాకు పలుకిచ్చి(ఫోనుచేసి)నారు. ఆయన మించిదుపు(ఎలెక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్)లో వంచ మరమరి(చీఫ్ ఇంజినీర్)గా పనిచేసినవారు. ట్రాన్స్‌ఫార్మర్ అంటే నియంత్రించేది కాదనీ, మార్చేదనీ, దీనికొక తెలుగుపేరును చెప్పమనీ, ఆ ఆకికవాళ్లకు తెలియచేస్తాననీ అన్నారు. ఈర్చేది ఈర్పెన అయినపుడు, మార్చేది మార్పెన అవుతుంది. కాదూ కూడదూ అది నియంత్రిస్తుంది అని వాళ్లు అంటే నియంత్రికకు తెలుగుమాట అదుపెన అవుతుంది అని చెప్పినాను. పారుపల్లిగారు ఆ ఆకికకు ఇదంతా విడమరచి చెపుతూ ఒక కమ్మను రాసినారట. కమ్మ ఏమయిందో, నియంత్రిక అలాగే ఉంది. నన్నయ నుండి చిన్నయ వరకూ సాగిన సంసుక్రుత మాటలు చొప్పింత, కొన్నేళ్లపాటు ఆగింది. దానిని తెలుగు పేరోలగం(అకాదెమీ) వారు మరికొన్నేళ్లు సాగించి చాలించుకొన్నారు. ఇప్పుడు ఆ పనిని ఒక నాడాకిక తలకెత్తుకొని మోస్తున్నది. ఎన్నాళ్లు మోస్తుందో చూద్దాం" అంటూ ముగించినాను.

(తరువాయి వచ్చే సంచికలో...)



స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

9

తెన్నాట(ఇప్పటి తమిళనాట) మా పెద్దలనోళ్లలో ఒక తెలుగుమాట ఉంటుంది. "ఎసిదెరిగిన వాండు ఇట్ట మాటాడుతుడా" "పసుదులు ఉండి అయినా ఎసుదులు చదవవాల" అంటుంటారు వాళ్లు. ఎసిది అంటే శాస్త్రం, ఎసుదులు అంటే శాస్త్రాలు, పసుదులు అంటే పస్తులు. తమిళంలో ఎసిదిని 'ఇయల్' అంటారు. శాస్త్రం అంటే దారిచూపేది, అనుసరించ తగినది అనే కదా. తెలుగులో కూడా పాతతరి పెద్దలు 'ఎయిదు' అనే పనిపలుకును వాడి ఉన్నారు. ఈమాటకు 'అనుసరించు' అని తెల్లము. తెలుగు నుడిగంటులలోకి ఈ మాట ఎక్కి ఉంది కూడా. కాబట్టి 'ఎసిది' అనే తెన్నాటి తెలుగుమాట వాడరానిదేమీ కాదు. ఈ ఎసిదిని చేర్పుగా వాడుకొంటే చాలినన్ని ఆనిమి(సాంకేతిక) మాటల్ని పుట్టించవచ్చు. మచ్చుకు కొన్ని.

1.	ఉసురు+ఎసిది	ఉసురెసిది	జీవశాస్త్రం
2.	మనుము+ఎసిది	మనుమెసిది	జంతుశాస్త్రం
3.	ఏడు+ఎసిది	ఏడెసిది	వృక్షశాస్త్రం
4.	వేదు+ఎసిది	వేదెసిది	రసాయనశాస్త్రం
5.	పొరుడు+ఎసిది	పొరుడెసిది	భౌతికశాస్త్రం
6.	నెలవు+ఎసిది	నెలవెసిది	భూగోళశాస్త్రం
7.	లెక్కింపు+ఎసిది	లెక్కింపెసిది	గణాంకశాస్త్రం
8.	మనిసి+ఎసిది	మనిసెసిది	ఆంత్రోపాలజీ
9.	తొల్లి+ఎసిది	తొల్లెసిది	పురావస్తుశాస్త్రం
10.	నుడి+ఎసిది	నుడెసిది	భాషాశాస్త్రం
11.	కూటువ+ఎసిది	కూటువెసిది	సామాజికశాస్త్రం
12.	ఒడమి+ఎసిది	ఒడమెసిది	ఆర్థికశాస్త్రం
13.	మర+ఎసిది	మరెసిది	ఇంజినీరింగ్
14.	పుడమి+ఎసిది	పుడమెసిది	జియోలజీ
15.	ఎద+ఎసిది	ఎదెసిది	కార్డియాలజీ
16.	విడమరపు+ఎసిది	విడమరపెసిది	ఎటిమాలజీ
17.	పురుగు+ఎసిది	పురుగెసిది	ఎంటమాలజీ
18.	పులుగు+ఎసిది	పులుగెసిది	ఆర్నితాలజీ
19.	గద్దె+ఎసిది	గద్దెసిది	జ్యోతిషశాస్త్రం
20.	విరుగు+ఎసిది	విరుగెసిది	వైద్యశాస్త్రం

ఇట్లాంటివి ఎన్ని మాటలనైనా కొత్తగా 'ఎసిది'తో పుట్టించవచ్చు

10

'ఇక' అనే చేర్పు గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. ఒక పనిపలుకుకు 'ఇక'ను చేర్చితే అది పేరుపలుకు అవుతుంది. చేరు+ఇక=చేరిక; కదలు+ఇక= కదలిక వంటివి. ఎందుకనో తెలుగుపెద్దలు ఆనిమిమాటల పుట్టింపులో ఇంత తేలికయిన, అందరూ వాడుతున్న చేర్పును కూడా పట్టించుకోలేదు, వాడలేదు. మనం వాడి చూద్దాం.

1.	అగలు+ఇక	అగలిక	క్షీణత
2.	అచ్చు+ఇక	అచ్చిక	జామీను
3.	అణగు+ఇక	అణగిక	అంతర్గతం
4.	అడపు+ఇక	అడపిక	నియంత్రణ/కంట్రోల్
5.	అదరు+ఇక	అదరిక	ప్రసారం/టెలికాస్ట్
6.	అదలు+ఇక	అదలిక	శోకం
7.	అడ్డు+ఇక	అడ్డిక	నిరోధకం
8.	నొగులు+అడ్డు+ఇక	నొగులడ్డిక	వ్యాధినిరోధకం/ ఇమ్యూనిటీ
9.	అంటు+ఇక	అంటిక	ఆశ్రయం
10.	అత్తు+ఇక	అత్తిక	ఏకీభావం
11.	అదరు+ఇక	అదరిక	కంపనం
12.	అందు+ఇక	అందిక	సమానం
13.	అను+ఇక	అనిక	వాచకం/వచనం
14.	అరుగు+ఇక	అరుగిక	ప్రయాణం
15.	అరుము+ఇక	అరుమిక	ప్రతిఘటన
16.	అలదు+ఇక	అలదిక	చిత్రలేఖనం
17.	అలము+ఇక	అలమిక	ఆక్రమణం
18.	అలయు+ఇక	అలయిక	శ్రమ
19.	అలరు+ఇక	అలరిక	వికాసం
20.	ఆము+ఇక	ఆమిక	ఆవరణం

ఇట్లాంటివి వేనవేల మాటలను పొందించవచ్చు. పైన చెప్పిన మాటలన్నీ పనిపలుకులకు 'ఇక'ను చేర్చి చెప్పినవి. పేరుపలుకులకు 'ఇక'ను చేర్చవచ్చా, అని అడిగితే, తెలుగులో చేర్చకూడదు, సంసుక్రుతంలో అయితే చేర్చవచ్చు అంటారు మన పెద్దలు. 'అక్కటి' అనేది తెలుగుమాట. ఇది పేరుపలుకు. దీనికి 'ఇక'ను చేర్చి 'అక్కటిక' అనే ఇంకొక పేరుపలుకును పొందించి ఉన్నారు మన పాతతరి పెద్దలు. ఒక్క మచ్చు చాలదా మనం అల్లుకుపోవడానికి.

1.	ఆకు+ఇక	ఆకిక	పత్రిక
2.	చుట్ట+ఇక	చుట్టిక	సిగరెట్

మరలా వేలమాటలను పుట్టించవచ్చు. తెలుగు చేవలేనిది కాదు. తెలుగుదారిన నడుద్దామనే తలపు మనకు కలగాలంతే.

చదువరులకు విన్నపం

అమ్మనుడి చదువరులకు దండాలు. ఇదివరకు ఎన్నోసారులు చెప్పినదానినే మరలా మరొక్కసారి గురుతు చేస్తున్నాను. ఇంట్లో పిల్లలచేత అమ్మానాన్నా అని పిలిపించుకోవడం, అంగళ్లమీద పేర్లను తెలుగులో రాయించడం, తెలుగును ఎందుకు వాడడం లేదంటూ

తరువాయి 22వ పుటలో....

తీసుకురావాలని చెప్తే చాలదు; దానిని సాధించటం ఎలాగో కూడా వివరించాలి. కమ్యూనిస్టు తరహా వర్గపోరాటం ద్వారా మనం సోషలిజాన్ని నిర్మించజాలం. వెంటనే సాధించటం అనే పరీక్షలో కమ్యూనిస్టు విధానాలు పూర్తిగా విఫలమయ్యాయి. కమ్యూనిస్టు పోరాటాలలోని ఏ చర్యా కూడా దాన్ని సమర్థించుకోలేదుగాని వారు చేపట్టిన ప్రతి చర్యా బహుశా ఆగామి చర్యల ఫలితాలతో సమర్థింపబూనటం జరిగింది. ఇటువంటి స్థితివల్ల గొలుసుకట్టు విధానం పెరుగుతూ పోయింది; విధానం డొంకతిరుగుడు వ్యవహారంగా మారింది; చివరకు ఫలితంగా లక్ష్యాలు జారిపోయే దశకు చేరుకున్నాయి.

చిన్న పరిశ్రమకు చెందిన యంత్రాలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. కొందరు దానిని చరఖాతో సరిపోల్చారు. దాని వినియోగాన్ని ఆదిమ కాలపు పద్ధతులుగాను, అప్పటి పనిముట్లుగాను ముద్రవేశారు. నేను మరో అధునాతన యంత్రాన్ని గురించి మాట్లాడాను. భారీ యంత్రాల ప్రయోజనాన్ని కూడా త్రోసిపుచ్చలేదు. ఎవరయినా కొందరు నేను భారీ జౌళి పరిశ్రమ స్థానంలో చరఖాను సూచిస్తున్నాను అనుకుంటే వాళ్ళు పప్పులో కాలేసినట్లే. పోనీ చరఖా విషయమే తీసుకోండి. దాన్ని ఎవరయినా యథాతథంగానయినా లేదా దానిలో అంతర్గతంగా దాగివున్న ఆర్థిక భావన ప్రకారమయినా పరిశీలించవచ్చు. భారీయంత్రము, పెద్ద యెత్తున సువ్యవస్థీకరణ మీకు కొన్ని కాన్పూరులనో, కలకత్తాలనో ప్రసాదించవచ్చు. అయితే అటువంటి ఆవేశపు చర్యలు ద్వేషాలతోపాటు వాటి చుట్టూ దైన్యం, పతనమైన మానవత్వం, ఉపాధిలేమి, పేదరికపు సముద్రాలు నిలుస్తాయి.

గత సంవత్సరం అమెరికాలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను కలసినప్పుడు, నేను ఆయనతో వికేంద్రీకరణకు సంబంధించిన సాంకేతిక ప్రక్రియల్ని గురించి చర్చించాను. ఇంతటి ప్రపంచ విజ్ఞాన శాస్త్రవేత్త కూడా లఘు పరిశ్రమకు చెందిన చిన్న యంత్రాల సాంకేతికత్వాన్ని కాని ఆధునిక సువ్యవస్థీకరణను కాని కాదనలేదు. వాటి సంభవనీయతను అంగీకరించాడు. ఆయన యింకా అంగీకరించిన అంశమేమంటే ఆధునిక మానవుని మేధ తన యానాన్ని ముగించుకునే దశకు చేరుకున్నదని. బ్రిటన్, ఫ్రాన్స్ ఒకనాడు యాంత్రిక అభివృద్ధికి అగ్రభాగాన నిలిచాయి. అయితే గత 50 సంవత్సరాలుగా ఆ రెండు దేశాల్లో చెప్పుకోదగినంతగా సాంకేతిక అభివృద్ధి కన్పించదు. సాంకేతిక విప్లవం అమెరికా, రష్యాలలో పరాకాష్ఠకు చేరుకున్న విషయం వాస్తవమేకాని పశ్చిమ ఐరోపాలో గత మూడు దశాబ్దాలుగానో, అంతకుమించో అది అలాగే నిలిచిపోయింది. అక్కడ జీవితం ఎలా తయారయ్యిందంటే ఉత్పత్తి పెంపుకు, జీవన ప్రమాణాల పెరుగుదలకు సంబంధించిన తృష్ణ తీరటం లేదు. ఎంతగా ఆ దేశాల్లో సామాజిక సమానత్వం శిఖరాగ్రాన్ని చేరుకున్నా ఎటుచూచినా ఏదో బెంగ, ఆరాటం, ఉద్రిక్తత, సాధారణమైన శూన్యతాభావం నెలకొంది. భరించనలవికాని బాధలు, పారలౌకిక అసమానతల కారణంగా ఆధునిక నాగరికత నక్కమీద తాటిపండు పడినట్లు మూల్గుతుంది. నడ్డి విరిగిపోతున్నది. పాశ్చాత్య మానవుడు తనలో తాను శాంతిగ, కాంతిగ బ్రతకటం లేదు. తన అసలు సిసలైన ఆవాసం కొరకు అన్వేషణలో నిర్వాసితుడే.

అందుకే సోషలిజం అనే ఈ సుదీర్ఘ తీర్థయాత్ర. అది మానవుణ్ణి నిర్వాసిత్వం నుండి, అతని మనోవేదనాభరిత స్వయం పరాయీకరణ నుండి ఒడ్డున పడవేస్తుంది. ఆ తీర్థయాత్ర వర్తమానంలో, మనదేశంలో సరికొత్త దిశానిర్దేశాన్ని కోరుకుంటున్నది. దానిని అందించేందుకు మనం కేవలం సంప్రదాయానికి విధేయతను ప్రకటించినందువల్ల ప్రయోజనం లేదు. దానిని మనం బ్రతికించుకోవటం అన్నదే ఏకైక మార్గం. అదిగో అటువంటి ఆశాజనక, వినయపూర్వక స్ఫూర్తితో సిద్ధాంత చర్చను నిర్వహించాం. అయితే నాకు హృదయోల్లాసాన్ని సమకూర్చిన అంశమేమంటే మన సభ్యుల్లో అత్యధికులు ఒడ్డున నిలబడి చోద్యం చూడటమో లేదా అక్కడి నుండి జారుకునే ప్రయత్నమో చేయకపోవటమే.

(పచ్‌మరి ప్రసంగం, మే1952)

19 వ పుట తరువాయి...

కొత్త మాటల పుట్టింపు

దొరతనం(ప్రభుత్వం) వారిని నిలదీయడం, ఇవన్నీ చేయవలసిన పనులే. కానీ ఇంత చేసి ఊరుకొంటే తెలుగు నిలబడదు. తెలుగుకు బడిలో గుడిలో ఏలుబడిలో చోటు కల్పించాలి, ముందువరసలో నిలపాలి. తెలుగును ఎసిది(శాస్త్ర)నుడిగా ఎదిగించాలి. రెండువేల ఏళ్ల కిందటనే సంసు్క్రుతంలో ఈ పని జరిగింది. ఎసిదినుడి కావాలంటే నెన్నొడి(పరిబాష/సాంకేతికపదాలు)ని బాగా పెంపొందించుకోవాలి. చిట్టిపొట్టిగా నెన్నొడిని పొందించడానికి తెలుగు ఎంతో అనువయిన నుడి. అందుకు ముందుగా తెలుగులో ఉన్న చేర్పులను గుర్తించాలి. వాటిని కుదురులకు కలపాలి. అప్పుడు నెన్నొడి పుడుతుంది. తెలుగులో మునుచేర్పులూ వెనుచేర్పులూ కలసి నూటికి పైగా ఉన్నట్లు నా ఎరుకలోకి వచ్చింది. నుడి ఎసిదరులు(శాస్త్రవేత్తలు) పనిగట్టుకొని వెతికితే ఇంకా ఎన్నో బయటపడుతాయి. నా ఎరుకకు వచ్చిన కొన్ని చేర్పులతో కొత్తమాటలను పుట్టించి చూపాలని, అమ్మనుడిలో 'కొత్తమాటల పుట్టింపు' పేరుతో నాలుగు నెలలపాటు రాసినాను. ఇంతలో నేను మరొక పనిని తలకెత్తుకోవలసి వచ్చింది.

తెలుగువారిలో కళలు చాలా ఉన్నాయి. కనుబరుపు(ప్రదర్శన) కళలూ, చేనేర్పు(హస్తనైపుణ్యం) కళలూ కలిసి, నా ఎరుకలోకి వచ్చినవే అయిదు వందలకు పైగా ఉన్నాయి. వీటిలో చాలా కళలు కనుమరుగు అయిపోతూ ఉన్నాయి. వీటన్నిటీ కనికి(వీడియో) పొదక (రికార్డింగ్) చేసే పనిలో తలమునకలు అయివున్నాను. 'డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి' వారు ఈ పనికోసం ముందుకు వచ్చినారు. అందువల్లనే కొత్తమాటల పుట్టింపును కొనసాగించలేకపోతున్నాను. ఈనెలలో ఈచేర్పులతో ఈపనిని ఇప్పటికి ఆపుతున్నాను.మరొకమారు ఎప్పుడయినా కొనసాగిస్తాను.